RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

https://netimanadesam.com/

సంపుటి :21 సంచిక 103 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి మంగళవారం 14-4-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత రుతువు, చైత్ర మాసం, తిథి॥ ద్వాదశి రా॥9.12, శతభిషం మ॥1.08, వర్జ్యం రా॥ 7.42 -9.18, దుర్ముహూర్తం ఉ॥ 8.21-9.10, శుభ సమయం మ॥ 12.00-1.30, రాహుకాలం మ॥3.00-4.30, సూర్యోదయం ఉ॥ 5.59, సూర్యాస్తమయం సా॥ 6.08 గం॥

రాజమండ్రి జైలుకు ఉగ్రలింకుల కేసు నిందితులు 2లో

## రాష్ట్రపతిని కలిసిన లోకేశ్ బృందం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 (ఆర్ఎన్ఎ):** రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఏపి ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది. అమరావతి బిల్లు అమల్లోకి రావడంతో ఏపీ మంత్రి నారా లోకేశ్, కూటమి ఎంపీలు ముర్ముతో భేటీ అయ్యారు. అమరావతి బిల్లు చట్టరూపం దాల్చడంతో.. లోకేశ్ బృందం రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా అమరావతి చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని రాష్ట్రపతికి లోకేశ్ వివరించారు. అమరావతి రాజధాని ప్రజల కల అన్నారు. ఇందుకోసం రైతులు 33 వేల ఎకరాలు ఉదారంగా ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిన నష్టాన్ని వివరించారు.



# నెలాఖరులోగా డీ-రెగ్యులేషన్ ఫేజ్-2

- దరఖాస్తు నుంచి అనుమతుల వరకు ఆన్‌లైన్
- కేంద్ర కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ బృందంతో సిఎం బాబు సమీక్ష

**అమరావతి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మే నెలాఖరులోగా డీ-రెగ్యులేషన్ ఫేజ్-2 అమల్లోకి వచ్చేలా చూడాలని సీఎం చంద్రబాబు అన్నారు. దరఖాస్తు నుంచి అనుమతుల వరకు వివరాలన్నీ ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఉక్కు మంత్రిత్వశాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని కేంద్ర ప్రతినిధి బృందంతో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. కేంద్ర ప్రతిపాదిత డీ-రెగ్యులేషన్ ఫేజ్-2 విధానాలపై చర్చించారు. పరిశ్రమల ఏర్పాటులో వేగం, అనుమతుల సులభతరంపై మాట్లాడారు. కేంద్రం రూపొందించిన మిగతా 2లో..

## మహిళా రిజర్వేషన్ బిల్లు 21వ శతాబ్దంలో అతి ముఖ్యమైన నిర్ణయం

– ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 (ఆర్ఎన్ఎ):** భారత సరికొత్త చరిత్ర లిఖించడానికి అతి చేరువలో ఉందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఈ 21వ శతాబ్దంలో అతి పెద్ద నిర్ణయాల్లో ఒకదానిని భారత్ తీసుకోబోతోందని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ను ఉద్దేశించి సోమవారం దిల్లీలో నిర్వహించిన 'నారీ శక్తి వందన్ సమ్మేళన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "భారత ప్రజాస్వామ్యాన్ని మహిళలు మరింత బలోపేతం చేస్తారు. మహిళల రిజర్వేషన్ల బిల్లు అత్యావశ్యకం. సుదీర్ఘ కాలం తర్వాత ఈ బిల్లు వస్తోంది. ప్రతి పార్టీ దీన్ని ముందుకు తీసుకెళ్లాలి. 2029లోగా మహిళా రిజర్వేషన్ బిల్లును మిగతా 2లో..

## బాంబులు..తూటాలకు ఓట్లతో సమాధానమిస్తారు

– కేంద్ర మంత్రి అమిత్ షా



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 (ఆర్ఎన్ఎ):** త్వరలో జరగనున్న ఎన్నికల్లో బెంగాల్ ప్రజలు బాంబులు, తూటాలకు ఓట్లతో జవాబు ఇస్తారని కేంద్ర మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. మమత ప్రభుత్వాన్ని అధికారం నుంచి దించేయాలని ప్రజలు నిర్ణయించుకున్నారని.. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది భాజపానేనని అన్నారు. పోలింగ్ రోజు ఎటువంటి అక్రమాలకు పాల్పడకుండా టీఎంసీ గూండాలు తమ ఇళ్లలోనే ఉండాలని.. లేదంటే ఫలితం వెలువడిన అనంతరం వారిని కటకటాల వెనక్కి పంపుతామని హెచ్చరించారు. బెంగాల్‌లోని రాణిగంజ్ ప్రాంతంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో నక్సలిజాన్ని మోదీ ప్రభుత్వం పూర్తిగా అణచివేసిందని.. ఇప్పుడు చొరబాటుదారులను తరిమికొట్టే సమయం ఆసన్నమైందని అమిత్‌షా అన్నారు. బెంగాల్ సహా దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి చొరబాటుదారులను బయటకు పంపిస్తామన్నారు. గతంలో మమతా బెనర్జీ మద్దతిచ్చిన మన్మోహన్ సింగ్ ప్రభుత్వం ఉగ్రవాదంపై ఎన్నడూ చర్యలు తీసుకోలేదని.. దానికి బదులుగా ఉగ్రవాదులకు మిగతా 2లో..

## శవరాజకీయాల్లో జగన్ దిట్ట

- తండ్రి చనిపోతే సిఎం కోసం పైరవీలు
- మంత్రి అచ్చెన్నాయుడు విమర్శ



**అమరావతి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శవరాజకీయలు నెరపడంలో జగన్ దిట్ట అని, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ తన తండ్రి శవం పక్కన ఉండగానే ముఖ్యమంత్రి కుర్చీ కోసం సంతకాలు సేకరించిన ఘనుడని సెటైర్లు గుప్పించారు. ఆయన శవ రాజకీయాలు మిగతా 2లో..

## హోర్ముజ్‌పై ట్రంప్ వ్యాఖ్యలు


దిగ్బంధిస్తే తీవ్ర పరిణామాలు... ఘాటుగా హెచ్చరిక చేసిన ఇరాన్



**టెహ్రాన్, ఏప్రిల్ 13 (ఆర్ఎన్ఎ):** హోర్ముజ్‌ను దిగ్బంధి స్తామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక లపై ఇరాన్ మరోసారి ఘాటుగా స్పందించింది. హోర్ముజ్ ఇప్పటికీ తమ నియంత్రణలోనే ఉందని పేర్కొంది. శత్రువులు ఏ చిన్న పొరపాటు చేసినా ప్రమాదం తప్పదని హెచ్చరించింది. అంతకుముందు ఇరాన్ సైనిక దళం (ఐఆర్‌జీసీ) కూడా ట్రంప్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. హోర్ముజ్ వైపు వచ్చే యుద్ధ నౌకలపై దాడి చేస్తామని హెచ్చరించింది. పౌర నౌకల రాకపోకలకు మాత్రం ఎలాంటి ఇబ్బందీ ఉండదని భరోసా ఇచ్చింది. యుద్ధ నౌకలు వస్తే మాత్రం కాల్పుల విరమణను ఉల్లంఘించినట్టేనని స్పష్టం చేసింది. ఇక యూఎస్‌తో చర్చలు విఫలం మిగతా 2లో..

## ఓటర్ జాబితాలో కొనసాగే హక్కు ఓటర్‌కు ఉంటుంది

'సర్'పై సుప్రీం వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 (ఆర్ఎన్ఎ):** పశ్చిమబెంగాల్‌లో నిర్వహించిన సర్ ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఓటర్ జాబితాలో కొనసాగేహక్కు ఓటర్‌కు ఉంటుందని వ్యాఖ్యానించింది. ఎన్నికలు నిర్వహించాలనే ఒత్తిడితో ఆ ప్రక్రియను వక్రీకరించకూడదని హితవు పలికింది. అదే సమయంలో సర్ ప్రక్రియలో ఓట్లు తొలగిం చారంటూ దాఖలైన పిటిషన్లను విచారించేందుకు మాత్రం నిరాకరించింది. వారి పిటిషన్లు ఇప్పటికే అప్పిలేట్ ట్రైబ్యునళ్ల ముందు విచారణకు ఉన్నాయని వ్యాఖ్యానించింది. సరైన ప్రక్రియ లేకుండా ఎన్నికల సంఘం ఏకపక్షంగా పేర్లను తొలగిస్తోం దని, ఈ తొలగింపులపై దాఖలైన పిటిషన్లను సకాలంలో విచారించడం లేదని పిటిషనర్లు ఆరోపించారు. "పిటిషనర్లు ఇప్పటికే ట్రైబ్యునళ్లను ఆశ్రయించడంతో.. ప్రస్తుత అభిప్రాయాలు అర్థంలేనివి" అని సుప్రీం వ్యాఖ్యానించింది. ఈ పిటిషన్లను విచారించేందుకే కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు 19 ట్రైబ్యునళ్లు మిగతా 2లో..

## ఆస్తిపన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ

నెలఖారు వరకు గడువు పొడిగింపు

**అమరావతి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణ ప్రాంతాల్లో ఆస్తిపన్ను బకాయిలపై ఆస్తిపన్ను బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 31 మార్చి 2026 నాటికి ఉన్న బకాయిలపై వడ్డీలో 50 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. అయితే ఈ గడువును ఈ నెలాఖరు వరకు పొగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ రాయితీని పొందాలంటే బకాయి మొత్తం పూర్తిగా చెల్లించి, మిగిలిన 50 శాతం వడ్డీని ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఆస్తిపన్ను చెల్లించని వారికి గోల్డెన్ ఛాన్స్ అని చెప్పుకోవాలి. సీడీఎమ్ఏ కమిషనర్ సంపత్ కుమార్ సూచనల మిగతా 2లో..

## శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా రైలు

– హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించిన రామ్మోహన్



**శ్రీకాకుళం, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాకుళం జిల్లావాసుల ఎన్నో ఏళ్ల కల నెరవేరింది. శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా మొదటి రెగ్యులర్ రైలు ప్రారంభమైది. హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రారంభించారు. రూ.35 కోట్లతో శ్రీకాకుళం రైల్వేస్టేషన్ అభివృద్ధి చేశామని రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం ప్రజల దీర్ఘకాలిక కోరిక నెరవేరిందంటూ ఆయన ఆనందం వ్యక్తం చేశారు. 75 ఏళ్ల జిల్లా చరిత్రలో తొలిసారిగా శ్రీకాకుళం నుంచి తిరుపతికి నేరుగా రెగ్యులర్ రైలు సర్వీస్ ప్రారంభమైందని తెలిపారు. త్వరలో మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు పూర్తవుతుందని తెలిపారు. ఇక హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలు శ్రీకాకుళం రోడ్ నుంచి ప్రతి సోమవారం, తిరుపతి నుంచి ప్రతి ఆదివారం అందుబాటులో ఉంటుంది. గతంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చొరవ తీసుకుని శ్రీకాకుళం నుంచి తిరుపతికి రైలు నడపాలని రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ని కోరారు. వెంటనే స్పందించిన రైల్వేమంత్రి ఈ ప్రతిపాదనలపై అధికారులకు ఆదేశాలు ఇవ్వడంతో రెగ్యులర్ రైలును మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈక్రమంలో తాజాగా శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ నుంచి తిరుపతికి రైలు నంబర్ 17439/40 హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభమైంది. ఈ హమ్ సఫర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం సాయంత్రం తిరుపతి నుంచి బయల్దేరుతుంది.. అలాగే ప్రతి సోమవారం శ్రీకాకుళం రోడ్డు నుంచి బయల్దేరుతుంది.

అపవిత్ర కార్యం ఎంత చెడ్డదో అపవిత్ర ఆలోచన కూడా అంతే చెడ్డది. ఒడుదుడుకులను తట్టుకునే శక్తి మన సంస్కృతీ, సంప్రదాయాలకే ఉంది. కానీ విజ్ఞానానికి లేదు.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# అంబేద్కర్ ఆశయాలకు పట్టం కట్టాలి !

అంబేద్కర్ మహాశయుడు ఈ దేశం గురించి గొప్పగా కలలు కన్నారు. తన దేశాన్ని ఉన్నతంగా చూడాలను కున్నారు. అస్పృశ్యతను పూర్తిగా నిర్మూలించడంతో పాటు, అందరికీ విద్య దక్కాలన్న ఆశయం ఆయనది. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, రాజకీయవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజ్యాంగ నిర్మాతగా భారతీయుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే మహనీయుడు డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్. అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ.. దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేద్కర్. దేశంలో అన్ని మతాలు, తెగలు, దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాలు తదితర వర్గాలకు సమ న్యాయం జరిగేలా, వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ఉండేందుకు, సర్వసత్తాక సౌర్వభౌమాధి కారాన్ని దక్కించు కొనేందుకు వీలుగా అంబేద్కర్ రాజ్యంగాన్ని రూపొందించారు. వివిధ రకాల భాషలు, ఆచారాలు, మతాలూ ఉన్న ఈ దేశంలో ఆయన ముందు చూపుతో రాసిన రాజ్యాంగం అనుసరించి ఇప్పుడు మన దేశం నడుస్తుంది అంటే ఆయన గొప్పతనం ఏంటో అర్థం అవుతుంది. ఆయన కేవలం దళితుల కోసమో లేక వాళ్ళ రిజర్వేషన్‌ల కోసమో మాత్రమే కృషి చేయలేదు. ఆడవాళ్ళకి మగవాళ్ళకి సమానమైన జీతాలు ఉండాలని, ఆడవాళ్ళకి ప్రెగ్నెన్సీ టైం లో లీవ్స్ ఇవ్వాలని, పని గంటల సమయాన్ని 12 నుండి 8 గంటలు చేయాలనీ, స్త్రీలకూ ఆస్తి హక్కు ఇవ్వాలని ఇలా ఎన్నో అంశాలలో ఈయన కృషి చేసారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని యావత్ భారతావని ఆయన ఆశయాలపై ఇప్పటికైనా అధ్యయనం చేయాలి. ఎంతసేపు అంబేద్కర్ పేరు చెప్పి విగ్రహాలు పెట్టడం, సభలు పెట్టడం కాదు. ఆయన దేశానికి అందించిన విలువైన సూచనలు పాటించాలి. ఆయన కోరుకున్న సమాజం కోసం పాలకులు ఆలోచన చేయాలి. అందుకు నడుం బిగించాలి. జయంతి సభల్లో ఉపన్యాసాలు ఇవ్వడం మానాలి. ఒక సమయంలో అంటరానితనం పేరు తో అట్టడుగు వర్గాల ప్రజల పరిస్థితి ఏ విధంగా ఉండేదన్నది ఆయన జీవితమే పెద్ద ఉదాహరణ. అప్పటి వరకు మూగ బోయిన అణగారిన ప్రజలకు గొంతుకయ్యాడు. అయితే కొందరు రాజకీయంగా ఆయనను ఎదగకుండా చేశారు. స్వాతంత్ర్యం రాగానే నెహ్రూ బదులు అండేబ్కర్‌ను ప్రధానిని చేసివుంటే మనదేశ రాత మరోలా ఉండేది. కానీ నెహ్రూ, గాంధీల కుట్రలకు ఆయన బలయ్యారు. భారత రాజ్యాంగ నిర్మాత, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆర్థిక నిపుణుడు, దళితోద్ధారకుడు, మహా మేధావి, బహుముఖ ప్రజ్ఞాశాలి, ఇలా ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. అందుకే నేమో ఆయనను ఆనాటి నేతలు దూరం పెట్టారు. ఈనాటి నేతలు విగ్రహాలు పెట్టి, కేవలం చెక్క భజనలు చేస్తున్నారు. కానీ ఆయన స్వప్నించిన భారతాన్ని ఆవిష్కృతం చేసే ప్రయత్నాలు చేయడం లేదు. 1891 వ సంవత్సరం ఏప్రిల్ 14 వ తేదీన రాంజీ మాలోజి సక్పాల్ ,భీమాబాయ్ దంపతులకు మధ్యప్రదేశ్ లోని మావ్ గ్రామంలో మహర్ కులంలో అంబేద్కర్ జన్మించారు. అప్పట్లో ఈ కులం వారిని అంటరానివారిగా పరిగణించేవారు. దళితుడు అనే కారణంతో ఈయన చిన్న వయసు నుండే ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. చిన్నప్పుడు వాళ్ళ అన్నయ్యతో కలిసి వేరే ఊరుకి నడిచి వెళ్తుంటే బాగా దాహం వేయడంతో దగ్గరలో ఉన్న ఒక ఇంటికి వెళ్లి తాగడానికి నీటిని అడిగితే అంబేద్కర్ మహర్ కులానికి చెందిన వారు అని తెలిసి నీళ్లు ఇవ్వకపోగా, పక్కనే ఉన్న మురికి గుంటలో నీటిని తాగమని తిట్టి పంపించారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఇలాంటి అనేక అవమానాలను అంబేద్కర్ ఎదుర్కొన్నారు. అందుకే ఇలాంటి వ్యవస్తను నిరసించాడు. అలాగని మిగతా కులాల వారిని ఏనాడూ ఆయన ఈసడించుకోలేదు. ఇది వ్యవస్తాగతమైన లోపంగా గుర్తించారు. తన ఆలోచనలను రాజ్యాంగ రచనలో చూపారు. భారత దేశం ఉన్నతంగా ఉండాని కోరుకున్నాడు. దేశ విభజనను తీవ్రంగా వ్యతిరేకించారు. ఇదే విషయాన్ని నిర్మొహమాటంగా చెప్పారు. కానీ వారెవ్వరూ అంబేద్కర్‌ను లెక్కచేయలేదంటే, ఆయన పట్ల వారికి గల ప్రేమానురాగాలు ఏపాటివో వేరుగా చెప్పాల్సిన పనిలేదు. అమెరికాలో మొదటి సారిగా అంబేద్కర్ స్వేచ్ఛ అంటే ఏంటో చూసారు. అప్పుడు భారత దేశంలో ఉన్నట్టుగా కుల, జాతి వివక్షత లేదు. అందరికి సమానమైన గౌరవం, అవకాశాలు దక్కేవి. 1917 లో అంబేద్కర్ వెనక్కి వచ్చి ఒప్పందం ప్రకారం బరోడా సంస్థానంలో రక్షణశాఖలో ఉద్యోగంలో చేరారు. అక్కడ ఆయనకి ఒక గొప్ప అధికారిగా ఉద్యోగం దక్కింది కానీ ఈయన నిమ్న కులస్తుడు కావడంతో ఆయన కింద ఉండే ఉద్యోగులు కూడా ఆయనని గౌరవించే వారు కాదు. ఏదైనా ఒక ఫైల్ ఇవ్వాలంటే దూరం నుండే ఆయన టేబుల్ మీదకు విసిరేసేవారు. చదవాలన్న, పని చేయాలన్న, ఉండడానికి ఇల్లు కావాలన్నా, చివరికి నీళ్లు తాగాలన్న కూడా కులం అడ్డు వచ్చేది. ఉద్యోగం చేసుకుంటూనే 1927 నుండి అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయడం మొదలు పెట్టాడు. ఇలా మహద్ లో దళితుల మహా సభని ఏర్పాటు చేసారు. దేశంలో నలుమూలల నుండి కొన్ని వేల మంది దళితులు ఆ సభకు హాజరయ్యారు. అప్పటివరకు దళితులు మహద్ లోని చెరువులో నీటిని తాగడానికి అనుమతి ఉండేది కాదు. కానీ అంబేద్కర్ ఆ సభలో దానికి వ్యతిరేకంగా పోరాడి ఆ చెరువులో నీటిని తాగడానికి అనుమతి వచ్చేలా చేసారు. కొల్హాపూర్ మహారాజ్ సాహు మహరాజ్ అస్పృశ్యత , అంటరానితనాన్ని నివారించడానికి కృషి చేస్తున్నారు అని తెలుసుకుని ఆయన సహకారంతో మూగ వాళ్ళకి నాయకుడు అనే అర్థం వచ్చేలా 'మూక్ నాయక్' అనే పత్రికను అలాగే బహిష్కృత్ భారత్, జనతా , ప్రబుద్ధ భారత్ అనే పత్రికలూ నడిపారు. దళితులకు బడులలోకి, గుడులలోకి వెళ్ళడానికి అనుమతి పొందేలా ఉద్యమాలు చేపట్టి విజయం సాధించారు. ఆయన అంత స్థాయికి ఎదిగారు అంటే కారణం చదువు. కాబట్టే ఆయన అందరికి చదువు అందాలని కృషి చేసారు. ఆయితే సంపద కోసమో, అధికారం కోసమో పోరాటం చేయలేదు అట్టడుగు వర్గాల స్వేచ్ఛ కోసం ఆయన పోరాడేవారు. శోధించు, సమీకరించు, పోరాడు అనే సిద్ధాంతంతో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం, కులమాత బేధాలు లేని సమాజం కోసం కృషి చేసేవారు. స్వాతంత్రం వచ్చిన తరువాత అంబేద్కర్ కి కేంద్ర మండలిలో మొట్ట మొదటి న్యాయశాఖ మంత్రి గా పదవి వచ్చింది. అంతేకాదు భారత దేశపు రాజ్యాంగాన్ని రాసే అవకాశం దక్కింది. అయితే రాజ్యాంగం రచించడానికి నియమించిన సభ్యులలో ఒకరు రాజీనామా చేయడం, మరొకరు మరణించడం, కొంతమంది అమెరికాలో ఉండిపోవడం, మరికొంతమంది రాష్ట్ర రాజకీయాలలో నిమగ్నులవడం ఇలా రకరకాల కారణాల వలన భారత రాజ్యాంగం రచించే బాధ్యతంతా అంబేద్కర్ మీద పడింది. దాంతో ఆయన రాత్రీపగలు అనే తేడా లేకుండా నిరంతరం రాజ్యాంగ రచనలోని ఉండేవారు. తరువాత కొద్ది రోజులకి అనారోగ్యం కారణంగా 1956 డిసెంబర్ 6 వ తేదీన అంబేద్కర్ మరణించారు. ఆయన మరణించినగాని ఆయన కృషి ఇప్పటికీ ఎంతో మంది జీవితాలలో వెలుగుని నింపుతుంది. ఒకవేళ ఆయన పూనికుని ఉండకపోతే ఈనాటికి బడుగు బలహీన వర్గాల జీవితాలు ఇంకా అలాగే ఉండిపోయే వేమో.

# ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు... ఢిల్లీ హైకోర్టులో విచారణ

### దర్యాప్తు సంస్థల తీరుపై మండిపడ్డ కేజ్రీవాల్



**న్యూఢిల్లీ,ఏప్రిల్13(ఆర్ఎన్ఎ):** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు విచారణనుంచి జస్టిస్ స్వర్ణకాంత శర్మను తొలగించాలని కోరుతూ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ హైకోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. సోమవారం హైకోర్టు పిటిషన్‌పై విచారణ జరిపింది. కేజ్రీవాల్ స్వయంగా తన వాదనలు వినిపించారు. విచారణ ప్రక్రియలో పక్షపాతం ఉండవచ్చంటూ ఆందోళన వ్యక్తం చేశారు. విచారణ సందర్భంగా సాక్షుల వాంగ్మూలాలపై చేసిన వ్యాఖ్యలు తనను దోషిగా, అవినీతిపరుడిగా చిత్రీకరించేలా ఉన్నాయని కేజ్రీవాల్ కోర్టుకు తెలిపారు. దర్యాప్తు సంస్థలపై కూడా కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వంటి దర్యాప్తు సంస్థలు మొదట సాక్షులను అరెస్టు చేసి.. ఆ తర్వాత ఇతరులను ఇరికించేలా వారి నుండి బలవంతంగా వాంగ్మూలాలను తీసుకుంటున్నాయని అన్నారు. కాగా, ఈడీ నమోదు చేసిన రెండు వేర్వేరు కేసుల్లో కేజ్రీవాల్‌ను రౌస్ ఎవెన్యూ కోర్టు ఇటీవల నిర్దోషిగా ప్రకటించింది. దీనిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టరేట్ హైకోర్టులో సవాలు చేసింది. ఈడీ పిటిషన్‌పై జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఏప్రిల్ 6వ తేదీన విచారణ జరిపింది.

ఈ సందర్భంగా, కేజ్రీవాల్ సహా పలువురు దాఖలు చేసిన రెక్యూసల్ పిటిషన్లపై సమాధానం ఇవ్వాలని సీబీఐకి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

### క్రూడాయిల్ బ్యారెల్ ధర 103 డాలర్లకు చేరిక... భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు

**న్యూఢిల్లీ,ఏప్రిల్13(ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు మొదలు కావడంతో ముడి చమురు ధరలు భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 103 డాలర్లకు చేరుకుంది. హోర్ముజ్‌ను దిగ్బంధిస్తామని ట్రంప్ ప్రకటించడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లు డీలాపడ్డాయి. మరోవైపు డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మరింత పతనమైంది. ఇన్ని వ్యతిరేకతల నేపథ్యంలో సోమవారం సూచీలు నష్టాలతో ప్రారంభమయ్యాయి. నష్టాలతోనే రోజును ముగించాయి. గత సెషన్ ముగింపు (76,794)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు 1600 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా నష్టాల్లోనే కదలాడింది. అయితే ఉదయం భారీ నష్టాలను చవి చూసిన సూచీలు మధ్యాహ్నం తర్వాత కాస్త కోలుకున్నాయి. చివరకు సెన్సెక్స్ 702 పాయింట్ల నష్టంతో 76,847 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 207 పాయింట్ల నష్టంతో 23,842 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీలో జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, ఎమ్‌సీఎక్స్ ఇండియా, వోల్టాస్, సోలార్ ఇండస్ట్రీస్, అదానీ పవర్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి. ఐచర్ మోటార్స్, చోలా ఇన్వెస్ట్‌మెంట్, మారుతీ సుజుకీ, నిప్పాన్, ఏపీఎల్ అపోలో మొదలైన షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 307 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 330 పాయింట్లు కోల్పోయింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 93.38గా ఉంది.

# రాజమండ్రి జైలుకు ఉగ్రలింకుల కేసు నిందితులు

**విజయవాడ, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉగ్రలింకుల కేసులో అరెస్టయిన నిందితుల కస్టడీ ముగిసింది. ఐదు రోజులపాటు నిందితులను కస్టడీకి తీసుకొని పోలీసులు ప్రశ్నించారు. సామాజిక మాధ్యమాల్లో ఉగ్రవాద భావజాల వ్యాప్తిపై వివిధ కోణాల్లో ప్రశ్నించారు. బెన్ఎక్స్.కామ్, దేశవ్యాప్త ఉగ్ర నెట్‌వర్క్ విస్తరణ యత్నాలపై ప్రశ్నలు సంధించారు. కస్టడీ అనంతరం ఆరుగురు నిందితులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టగా.. ఈ నెల 20 వరకు రిమాండ్ విధించింది. దీంతో నిందితులను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.



## మొదటి పేజీ తరువాయి

# నెలాఖరులోగా డీ-రెగ్యులేషన్ ఫేజ్-2



ప్రతిపాదనలను సందీప్ పౌండ్రిక్.. ముఖ్యమంత్రి ఎదుట ఉంచారు. ఈ ప్రతిపాదనలపై వివిధ శాఖల ఉన్నతాధికారులతోనూ సీఎం సమీక్షించారు. పరిశ్రమలకు అనుమతులు, నిబంధనల్లో రాష్ట్రం చాలా ముందుందని సందీప్ పౌండ్రిక్ చెప్పగా.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానం అవలంబిస్తున్నట్లు వెల్లడించారు. డీ-రెగ్యులేషన్ ఫేజ్-3 చేపడుతున్నారా? అని సందీప్ పౌండ్రిక్‌ను సీఎం అడిగారు. జూన్ నెల నుంచి ఫేజ్-3పై పని చేస్తామని ఆయన తెలిపారు. ఫేజ్-3లో టెక్నాలజీ అనుసంధానం, ఏఐ టూల్స్ వినియోగానికి పెద్దపీట వేయాలని సీఎం కోరారు.ప్రస్తుతం 800కు పైగా ఉన్న నిబంధనలను 100 లోపునకు తీసుకురావాలని చంద్రబాబు సూచించారు. ప్రజల భద్రత, పర్యావరణం విషయంలో రాజీపడొద్దన్నారు. వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. అటవీ చట్టాలను సరళీకరించాలని కేంద్ర బృందానికి సూచించారు. ఫైర్ సేఫ్టీపై నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్ర నిబంధనల విషయంలో పలు సూచనలు చేశారు. డబుల్ లైసెన్సింగ్ తరహా పద్ధతులను తప్పించాలన్నారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవితకాలం చెల్లుబాటు అయ్యేలా నిబంధనలు సవరించాలన్నారు. స్టీల్ సెక్రటరీ ప్రతిపాదనలపై రాష్ట్రానికి చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారులతోనూ సీఎం సమీక్షించారు. పర్మిషన్లు, లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయాలని సీఎం చంద్రబాబు మార్గనిర్దేశర చేశారు. ప్రజల భద్రత, పర్యావరణం వంటి అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. డబుల్ లైసెన్సింగ్ తరహా పద్ధతులను తప్పించాలని దిశానిర్దేశం చేశారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవిత కాలం చెల్లుబాటు కావాలని సూచించారు. మే నెలాఖరులోగా డీరెగ్యులేషన్ ఫేజ్-2 అమల్లోకి వచ్చేలా చూడాలని.. ఆ మేరకు ఆర్డినెన్సులు తీసుకురావాలని దిశానిర్దేశర చేశారు. దరఖాస్తు నుంచి అనుమతుల వరకూ మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఫేజ్-2 అమలు తర్వాత పరిశ్రమల అనుమతుల ఏర్పాటుకు ఇప్పుడున్న ప్రక్రియలో 40 శాతం మేర సమయం తగ్గాలని సూచించారు. పరిశ్రమలకు అనుమతులు, నిబంధనలను సడలించే విషయంలో తమ ప్రతిపాదనలకంటే ఏపీ చాలా ముందుందని కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ తెలిపారు. ప్రజలకు సేవలు అందించడం కోసం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాన్ని అవలంబిస్తున్నట్లు సీఎం స్పష్టం చేశారు.

# హోర్ముజ్‌పై ట్రంప్ వ్యాఖ్యలు

కావడంపై ఇరాన్ మంత్రి అరాగ్చీ ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 47 ఏళ్ల తరువాత జరిగిన అత్యున్నత స్థాయి చర్చలకు తాము సదుద్దేశంతో వెళ్లామని చెప్పారు. ఒప్పందం అంగుళం దూరంలో ఉండగా యూఎస్ తన లక్ష్యాలను, ఉద్దేశాలను మార్చుకుందని ఆరోపించారు. మునుపటి అనుభవాల నుంచి ఎలాంటి గుణపాఠాలను అమెరికా నేర్చుకోలేదని అన్నారు. మంచి భావాలుంటే చివరకు మంచే జరుగుతుందని అన్నారు. మనసులో శత్రుత్వం ఉంటే తుదకు అదే మిగులుతుందని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. సోమవారం హోర్ముజ్‌లో నౌకల ట్రాఫిక్ స్తంభించిపోయిందని లాయిడ్స్ లిస్ట్ ఇంటెలిజెన్స్ అనే మారిటైమ్ సంస్థ తాజాగా పేర్కొంది. హోర్ముజ్‌ను దిగ్బంధిస్తామన్న ట్రంప్ ప్రకటన తరువాత నౌకల రాకపోకలు నిలిచిపోయాయని పేర్కొంది. ఎలాంటి ఒప్పందం లేకుండా ఇరాన్‌తో చర్చలు ముగియడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పందించారు. గతంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం మాత్రం కొనసాగుతోందని అన్నారు. ఇరాన్ మళ్లీ చర్చలకు వస్తుందా? రాదా? అనేది తనకు ఇక అనవసరమని కూడా చెప్పారు. ఇప్పటికే ఇరాన్ పరిస్థితి దగజారిందని, మిలిటరీ ధ్వంసమైపోయిందని చెప్పారు. శాంతి చర్చలు విఫలమవడానికి అమెరికానే కారణమని ఇరాన్ ఆరోపించింది. యుద్ధాన్ని ముగించేందుకు అమెరికాతో ఇరాన్ చిత్తశుద్ధితో సంప్రదింపులు చేసింది. కానీ, ఇస్లామాబాద్ ఒప్పందానికి కొన్ని అంగుళాల దూరంలోనే చర్చలు కుప్పకూలాయి. అతివాద భావజాలం, లక్ష్యాలు మారడం, నిర్బంధం వంటివి మాకు ఎదురయ్యాయి. మంచి చేస్తే మంచి జరుగుతుంది. చెడు చేయాలని చూస్తే శత్రుత్వమే మిగులుతుందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి పోస్ట్ చేశారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లు 21వ శతాబ్దంలో అతి ముఖ్యమైన నిర్ణయం

అమలు చేయాలి. ఈ నిర్ణయం మహిళా శక్తి, గౌరవానికి అంకితం. దేశ పార్లమెంట్ ఒక కొత్త చరిత్రను సృష్టించేందుకు దగ్గర్లో ఉంది. సమానత్వంతో కూడిన భారతదేశానికి ఇదొక తీర్మానం. ఇక్కడ సామాజిక న్యాయం నినాదానికే పరిమితం కాదు. అది మన పనిసంస్కృతిలో ఒక భాగం. రాష్ట్ర శాసనసభల నుంచి దేశ పార్లమెంట్ వరకు దశాబ్దాల నిరీక్షణకు తెరదించే సమయం ఆసన్నమైంది. ఆ సమయం ఏప్రిల్ 16, 17, 18" అని మోదీ వెల్లడించారు. "గతంలో ఇళ్లు పురుషుల పేర్ల మీదే ఉండేవి. భూమి, దుకాణం, కారు.. ఇలా ఏది చూసుకున్నా మగవాళ్ల పేరుమీదే ఉండేవి. అదంతా సహజమనే భావన ఉండేది. మేం పీఎం ఆవాస్ యోజన తీసుకువచ్చాం. దానికింద మహిళ పేరు మీదే ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు మేం ప్రాధాన్యం ఇచ్చాం" అని అన్నారు. ఇలా మహిళా సాధికారత కోసం తీసుకువచ్చిన పథకాల గురించి ప్రస్తావించారు. తాను కుటుంబ జీవితాన్ని జీవించకపోయినా.. ఆ వ్యవహారాలపై అవగాహన ఉందని ప్రధాని సరదాగా వ్యాఖ్యానించారు.

# బాంబులు..తూటాలకు ఓట్లతో సమాధానమిస్తారు

బిర్యానీతో విందు ఇచ్చిందని ఆరోపించారు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం పహల్గాం దాడులకు ప్రతీకారంగా పాక్‌లోని ఉగ్రవాదులను కోలుకోలేని దెబ్బకొట్టిందన్నారు. రాత్రి సమయాల్లో మహిళలు బయట తిరగాల్సిన అవసరం ఏముందని ఒకప్పుడు మమత ప్రశ్నించారని అమిత్ షా పేర్కొన్నారు. అటువంటి మాటలు ఆమె పదవికే సిగ్గుచేటని అన్నారు. అర్ధరాత్రి కూడా మహిళలు ధైర్యంగా తిరిగే వాతావరణాన్ని తాము బెంగాల్‌లో సృష్టిస్తామన్నారు. ఆర్జీకర్ లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

# శవరాజకీయాల్లో జగన్ దిట్ట

చేస్తున్నారని విమర్శించారు. సోమవారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో అచ్చెన్నాయుడు మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డి చరిత్ర ఈ రాష్ట్రానికి వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. ఆనాడు జగన్‌కు ఉన్న అధికార దాహం చూసే, ప్రజలు గత ఎన్నికల్లో 11 సీట్లు ఇచ్చి వైసీపీ అడ్రస్ గల్లంతు చేశారని అచ్చెన్నాయుడు విమర్శించారు. జనం ఆయనను ఛీత్కరించుకున్నా.. ఇంకా సిగ్గులేకుండా అమరావతిపై అబద్ధాలు, మావిగన్ అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తారా..? అని ధ్వజమెత్తారు. అమరావతిని అక్షయపాత్రగా మార్చి తమ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే.. జగన్ అండ్ కో అవినీతికి అది కామధేనువులా కనిపించడం మీ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజలు పెట్టిన వాత ఇంకా పచ్చిగానే ఉందని, అది మర్చిపోయి మాట్లాడితే మళ్లీ అదే గతి పడుతుందని అచ్చెన్నాయుడు హెచ్చరించారు.

# ఓటర్ జాబితాలో కొనసాగే హక్కు ఓటర్‌కు ఉంటుంది

ఏర్పాటయ్యాయి. ఇప్పుడు అవి విచారించాల్సిన అప్పీళ్ల సంఖ్య 30 నుంచి 34 లక్షల వరకు ఉందని ఈసీ తరఫు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు. ఈ అప్పీళ్లను నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరిస్తారా..? లేక గడువు పొడిగిస్తూనే ఉంటారా..? అని పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న సుప్రీం స్పందిస్తూ.."ఈ దేశంలో ఓటు హక్కు అనేది రాజ్యాంగపరమైనదే కాదు.. అదొక భావోద్వేగపూరితమైన అంశం కూడా. ఇది ప్రజాస్వామ్యంలో భాగం. ఒక ప్రభుత్వాన్ని ఎంచుకోవడంలో కీలకం. అలాగే కాలపరిమితి నిర్ణయించి, ట్రైబ్యునళ్లపై భారం మోపలేం. అధిక సంఖ్యలో ఓటర్లను తొలగించినా.. ఆ తొలగింపు వల్ల ఎన్నికలు ప్రభావితమైతే తప్ప ఎన్నికను రద్దు చేయలేం. న్యాయపరమైన జోక్యం అనేది ఎన్నికలను ప్రోత్సహించేలా ఉండాలి" అని వ్యాఖ్యానించింది. ఇక బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29న రెండు విడతల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే.

# ఆస్తిపన్ను బకాయిలపై 50 శాతం వడ్డీ రాయితీ

మేరకు.. ఈ రాయితీ అమలు ఏప్రిల్ 30 వరకు మాత్రమే అమల్లో ఉండనుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలపై మాత్రమే 50 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుంది. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వెంటనే వినియోగించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నును ఏప్రిల్ 30, 2026 లోపు ముందస్తుగా మొత్తం చెల్లించేవారికి 5 శాతం అదనపు రాయితీ కూడా లభిస్తుంది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలోనూ రాయితీ అమలులో ఉండనుంది. పట్టణాభివృద్ధికి పన్నులు చెల్లించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఆలస్యం చేయకుండా వెంటనే సమీప మున్సిపల్ కార్యాలయం, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఆస్తి పన్ను చెల్లించి ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.


**దక్షిణ రైల్వే**

చెన్నై డివిజన్ (వర్క్స్ శాఖ)

ఈ-టెండర్ నోటీసు నం. 12/2026 తేదీ: 10.04.2026

| క్రమ సంఖ్య | అంశం నం. | వివరణ |
|---|---|---|
| 1 | MAS12OF26054B | SW-I: ఎన్‌జీఓ భవనం పరిసరాల్లో సాధారణ సివిల్ నిర్వహణ పనులు; SW-II: ఎన్‌జీఓ అనెక్స్ భవనం పరిసరాల్లో సాధారణ సివిల్ నిర్వహణ పనులు. |
| 2 | MAS12OF26055B | నుంగంబాక్కం, స్టెర్లింగ్ గార్డెన్‌లో ఉన్న ప్రస్తుత పిల్లల ఆట స్థలాలు మరియు అవుట్‌డోర్ జిమ్ పరికరాల మరమ్మత్తులు. |
| 3 | MAS12OF26056W | పుత్తూరు వద్ద ఆర్‌పీఎఫ్ పోస్ట్ భవనం మరియు 15 పడకల ఆర్‌పీఎఫ్ బ్యారక్ నిర్మాణం. |
| 4 | MAS12OF26057W | ADEN/AJJ ఉప విభాగం: మాన్సూన్ రిజర్వ్ మెటీరియల్స్ కొనుగోలు ADEN/AJJ ఉప విభాగం |

టెండర్ ఓపెనింగ్ తేదీ మరియు సమయం: 04.05.2026 @ 11:30 గంటలకు
పూర్తి వివరాలు & టెండర్ పత్రాలు ఈ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి: http://www.ireps.gov.in

డివిజనల్ రైల్వే మేనేజర్/వర్క్స్/చెన్నై-03

**వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్**

VASTU HOUSING FINANCE

యూనిట్ నెం. 203 & 204, 2వ అంతస్తు, "A" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సేవ్రి (వెస్ట్), ముంబయి – 400015,మహారాష్ట్ర.
సీఐఎన్ నెం.: U65922MH2005PLC272501

**ఆస్తి స్వాధీన నోటీసు**

ఈ క్రింద సంతకం చేసిన నేను వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి గా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఆసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 ప్రకారం, అలాగే సెక్షన్ 13(12) తో పాటు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3 క్రింద నాకు కల్పించిన అధికారాలను వినియోగిస్తూ, క్రింద పేర్కొన్న రుణగ్రహీతలకు సంబంధించి, ఆయా నోటీసులలో పేర్కొన్న మొత్తాన్ని, ఆ నోటీసులు అందిన తేదీ నుండి 60 రోజుల్లోపు చెల్లించవలసిందిగా డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది.రుణగ్రహీతలు పేర్కొన్న మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైనందున, పై చట్టంలోని సెక్షన్ 13(4) మరియు సంబంధిత నియమావళిలోని రూల్ 8 ప్రకారం నాకు కల్పించిన అధికారాలను వినియోగిస్తూ, క్రింద వివరించిన ఆస్తిని, క్రింద పేర్కొన్న తేదీన స్వాధీనం చేసుకోవడమైనది. కావున, ముఖ్యంగా రుణగ్రహీతలు మరియు హామీదారులు, అలాగే సాధారణ, పజలు ఎవరూ కూడా ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు జరపరాదని హెచ్చరించబడుచున్నది. ఈ ఆస్తికి సంబంధించిన ఏవైనా లావాదేవీలు,కింద పేర్కొన్న మొత్తం, దానిపై వడ్డీ, ఖర్చులు తదితరాలతో కలిసి వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ శాఖకు ఉన్న బాధ్యతకు లోబడి ఉంటాయని తెలియజేయడమైనది.

| క్రమ సంఖ్య | రుణగ్రహీత పేరు, సహ రుణగ్రహీత పేరు రుణ ఖాతా నంబ్య | డిమాండ్ నోటీసు తేదీ & ఋణ మొత్తం | ఆస్తి వివరణ | స్వాధీనం తీసుకున్న తేదీ మరియు విధానము |
|---|---|---|---|---|
| 1 | షైక్ ఘౌస్ బాషా (ఋణగ్రహీత), షైక్ సలీమా (సహ-ఋణగ్రహీత), LP0000000077502 | 11/అక్టోబర్/2025 రూ. 6,18,168/- 9/అక్టోబర్/2025 నాటికి | ఎస్‌పిఎస్ఆర్ నెల్లూరు జిల్లా, అల్లూరు సబ్ రిజిస్ట్రార్ పరిధి, అల్లూరు మండలం, ఇందుపూరు గ్రామపంచాయతి, ఇందుపూరు గ్రామం, సర్వే నం. 147-A, జానకిరామయ్య వీధి, అసెస్‌మెంట్ నం. 271 గల ఆస్తి. క్రింది సరిహద్దులలో 30 అంకణాలు లేదా 240 చదరపు గజాల స్థలం, అందులో 6 1/2 అంకణాలు లేదా 468 చదరపు అడుగుల నిర్మాణం కలదు. ఆంధ్ర ప్రదేశ్ – 524315. సరిహద్దులు: ఉత్తరం – షైక్ గౌస్ బాషా స్థలం , దక్షిణం – రోడ్డు తూర్పు – రోడ్డు , పడమర – షైక్ రమీజా గారి ఇల్లు | లాంఛన ప్రాయిస్వాధీనం తీసుకున్న తేది:11/04/2026 |
| 2 | వాసు బి (మరణించినవారు), ఆయన భార్య బుచన్నగారి సైలజ (మరణించిన వాసు బి యొక్క చట్టబద్ధ వారసురాలు), సహ-ఋణగ్రహీత(లు): బుచన్నగారి సైలజ, LP0000000015340 | 2/డిసెంబర్/2025 రూ. 7,78,896/- 21/నవంబర్/2025 నాటికి | చిత్తూరు జిల్లా - శ్రీ బాలాజీ రిజిస్ట్రేషన్ జిల్లా, తిరుపతి - పాకాల సబ్‌డిస్ట్రిక్ట్ ఇరాల మండల పరిషత్, పోలకల గ్రామపంచాయతి, పోలకల గ్రామం ఖాతాలు, సర్వే నం. 1097/A2, 1114/A లోని హౌస్ ప్లాట్ నం. 17, ఇరాల, ఆంధ్ర ప్రదేశ్ – 517130 లో ఉన్న స్థిరాస్థి యొక్క భాగం. తూర్పు నుండి పడమర 52 అడుగులు లేదా 15.85 మీటర్లు, ఉత్తరం నుండి దక్షిణం 33 అడుగులు లేదా 10.06 మీటర్లు, మొత్తం విస్తీర్ణం 1716 చదరపు అడుగులు లేదా 191 చదరపు గజాలు. సరిహద్దులు: ఉత్తరం – పి. కుమార్ గారి స్థలం దక్షిణం – వెంకటరమణ గారి స్థలం , తూర్పు – బి. తంగవేలు వద్ద నిల్వ ఉంచిన స్థలం , పడమర – 15 అడుగుల వెడల్పు గల రోడ్డు | లాంఛన ప్రాయిస్వాధీనం తీసుకున్న తేది: 08/04/2026 |
| 3 | షైక్ అన్సార్ (ఋణగ్రహీత), షైక్ అఖ్తర్ (సహ-ఋణగ్రహీత), ఎస్ అఫ్జల్ (సహ-ఋణగ్రహీత), అఫ్జాన్ సాహినా ఖానం (సహ-ఋణగ్రహీత), LP0000000191596 | 15/డిసెంబర్/2025 రూ. 19,22,931/- 12/డిసెంబర్/2025 నాటికి | అన్నమయ్య జిల్లా, కలికిరి ఉప జిల్లా, కలికిరి మండలం, కలికిరి గ్రామ పంచాయతీ, కలికిరి గ్రామం మజారా వార్డు నెం.6, అమరనాథ రెడ్డి కాలనీ, డోర్ నెం.6-389, అసెస్మెంట్ నెం.860, సర్వే నెం.375/1 చిరునామాలో ఉన్న స్థిరాస్తిలోని ఆ భాగమంతా, తూర్పు నుండి పడమరకు 19 అడుగులు లేదా 5.795 మీటర్లు; ఉత్తరం నుండి దక్షిణానికి 45 అడుగులు లేదా 13.725 మీటర్ల సరిహద్దుతో; 855 చ.అ. లేదా 95 చ.గజాల పూర్తి స్థలం మాత్రమే కొలత కలిగి ఉంది, ఈ అంశం నెం.1లో: నిర్మించిన ఇల్లు గ్రౌండ్ ఫ్లోర్‌లో RCC మోల్డింగ్‌తో తూర్పు-పడమర 19 అడుగులు లేదా 5.795 మీటర్లు; ఉత్తర-దక్షిణం 25 అడుగులు లేదా 7.625 మీటర్లు; 475 చ.అ. కొలత గల RCC మోల్డింగ్ ఇల్లు. ఈ మొదటి అంతస్తులో, తూర్పు-పడమర 19 అడుగులు లేదా 5.795 మీటర్లు; ఉత్తర-దక్షిణం 25 అడుగులు లేదా 7.625 మీటర్లు; 475 చ.అ. కొలత గల ACC షీట్ల ఇల్లు. ఐటెం నెం.2:తూర్పు-పడమర 19 అడుగులు లేదా 5.795 మీటర్లు; ఉత్తర-దక్షిణం 13 అడుగులు లేదా 3.965 మీటర్లు; మధ్యలో కొలత: 247 చ.అ. కొలత గల ACC షీట్ల ఇల్లు. ఆంధ్రప్రదేశ్-517234 సరిహద్దులు ఈ క్రింది విధంగా ఉన్నాయి: ఉత్తరం – వి. హసన్ సాబ్ మరియు ఖాదర్ వల్లి ఇల్లు. దక్షిణం – రోడ్డు. తూర్పు – వై రాజారెడ్డి గారి ఇల్లు పశ్చిమం – పసుపులేటి నాగరాజు స్థలం మరియు ఇల్లు | లాంఛన ప్రాయిస్వాధీనం తీసుకున్న తేది:11/04/2026 |
| 4 | సి శేషమ్మ (ఋణగ్రహీత), సి గోవిందయ్య (సహ-ఋణగ్రహీత), సి నాగరత్నం (సహ-ఋణగ్రహీత), MHL000000239453 | 16/డిసెంబర్/2025 రూ. 8,54,460/- 16/డిసెంబర్/2025 నాటికి | చిత్తూరు జిల్లా, కార్వేటినగర్ సబ్ డిస్ట్రిక్ట్, వెదురుకుప్పం మండలం, పచ్చికపల్లం పంచాయతి, నక్కలంపల్లి గ్రామం, సర్వే నం. 270/9 లో ఉన్న స్థిరాస్థి యొక్క భాగం. ఆంధ్ర ప్రదేశ్ – 517569. స్థలం తూర్పు నుండి పడమర 35 అడుగులు లేదా 10.668 మీటర్లు, ఉత్తరం నుండి దక్షిణం 25 అడుగులు లేదా 7.62 మీటర్లు, మొత్తం విస్తీర్ణం 875 చదరపు అడుగులు లేదా 97.22 చదరపు గజాలు. సరిహద్దులు: ఉత్తరం – డి. సుమలత గారి ఇల్లు దక్షిణం – డి. వసంతమ్మ గారి ఖాళీ స్థలం తూర్పు – రోడ్డు పడమర – సరస్వతి గారి స్థలం | లాంఛన ప్రాయిస్వాధీనం తీసుకున్న తేది:11/04/2026 |

తేది : 14.04.2026
స్థలం : నెల్లూరు, చిత్తూరు, అన్నమయ్య

అధీకృత అధికారి
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

## ఇసుక, సిలికా,క్వార్జ్ దోపిడీ ఆపాలి

### -అమరావతి మరో కర్నూలు అవుతుంది
### -కలెక్టరేట్ వద్ద కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ ఆధ్వర్యంలో ధర్నా

**తిరుపతి,ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని సత్యవేడు, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల పరిధిలో సహజ వనరులను దోపిడీ చేసి,రోజుకు రూ. 300 కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతామోహన్ ఆరోపించారు. సోమవారం తిరుపతి కలెక్టరేట్ దగ్గర చేపట్టిన నిరసన కార్యక్రమం సందర్భంగా చింతామోహన్ మీడియాతో మాట్లాడారు. గత ఆరు నెలల కాలంలో ఒక సత్యవేడు నియోజకవర్గంలోనే ప్రభుత్వ అనుమతితో 50 వేల టిప్పర్లు ఇసుక బయటి రాష్ట్రాలకు తరలించారని, ఒక్క టిప్పర్ ఇసుక రూ.20 వేల రూపాయలకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఇసుక తరలింపునకు పర్మిషన్లు ఇచ్చింది ఎవరు? ఎంత ముడుపులు తీసుకుంటున్నారో పేర్లతో సహా తమకు తెలుసునని. వారి పేర్లను సమయం వచ్చినప్పుడు బయటపెట్టక తప్పదని హెచ్చరించారు. గూడూరు దగ్గర కిలో సిలికా రూ. 500 లకు అమ్ముకుంటున్నారని, ప్రతి రోజూ 100 కోట్ల రూపాయలు విలువైన సిలికా తరలిస్తున్నారని చెప్పారు. వెంకటగిరి దగ్గర సైదాపురంలో క్వార్జ్ గనులలో కిలో రూ.300లు ధర పలుకుతోందన్నారు. ప్రతి దినం వందల ట్రక్కుల లో సహజ వనరులను తరలించి, సొమ్ము చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు.ఈ అవినీతి, అక్రమాలు ముఖ్యమంత్రికి తెలిసి జరుగుతోందా? లేక తెలియడం లేదా? అని చింతామోహన్ ప్రశ్నించారు.సహజ వనరుల దోపిడీ అరికట్టకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు.రాయలసీమలో పుట్టిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాయలసీమ ప్రయోజనాలు కాపాడటంలో విఫలమయ్యారని విమర్శించారు.రాజధాని విషయంలో రాయలసీమకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. అమరావతి కట్టినా, మరో కర్నూలు అవుతుందని, తిరుపతి తప్పక రాజధాని అవుతుందని, దీన్ని ఎవరూ ఆపలేరని చింతామోహన్ పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రవి, గోపాల్ యాదవ్, శాంతి యాదవ్, తేజోవతి, సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

## రేణిగుంటలో అధ్వానంగా సంతగేటు రోడ్డు

**రేణిగుంట, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రేణిగుంటలో రైల్వే అండర్ బ్రిడ్జి మూసివేశారు. బైకులు, ఆటోలకు ప్రత్యామ్నాయంగా సంతగేటు మార్గాన్ని సూచించారు. ఈ రోడ్డు అధ్వానంగా ఉంది. చెత్తాచెదారం పేరుకు పోవడం, దుర్వాసన రావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు రోడ్డు గుంతలమయంగా మారింది. వెంటనే మరమ్మతులు చేస్తే వాహనదారులు కష్టాలు తీరుతాయి.

## రేణిగుంటలో జనగణనపై శిక్షణ

**రేణిగుంట,ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జనగణన, గృహ గణనపై శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఇళ్ల వివరాల సేకరణ, డేటా నమోదు, ఫీల్డ్ స్థాయి జాగ్రత్తలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి వివరాలను కచ్చితంగా నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ పథకాల రూపకల్పనకు సహాయపడుతుందని తెలిపారు. సచివాలయ సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

## అదమరిస్తే... అంతే సంగతి



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తి తిరుపతి మార్గంలో నక్కలకాల్వపై ఏర్పాటు చేసిన వంతెన ప్రమాదకరంగా మారింది. అభివృద్ధి పనుల దృష్ట్యా వంతెన వద్ద త్రవ్వకాలు చేపట్టారు. మళ్లీ సక్రమంగా పూడ్చక పోవడంతో ప్రమాదకరంగా మారింది. అజాగ్రత్తగా ఉంటే వాహనాలు నేరుగా నక్కలకాల్వలోకి దూసుకెళ్లే ప్రమాదం ఉంది. దీన్ని బాగు చేయడంతో పాటు సిమెంటు డివైడర్ ఏర్పాటు చేసి ప్రమాదాలను నియంత్రించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## పేదలకు ఆహారం పంపిణీ

**చిల్లకూరు, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గూడూరు పట్టణానికి చెందిన అత్తి మంజరి గోపాల్, మల్లేశ్వరి దంపతులు వారి కుమారుడు రామ శివకృష్ణ పుట్టినరోజు సందర్భంగా చిల్లకూరు మండలం శారద నగర్ లో చిల్లకూరు కట్ట కింద పేదవారికి ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. కృప సేవా చారిటబుల్ ట్రస్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కటకం శ్రీనివాసులు మాట్లాడుతూ పేదలకు సహాయం చేస్తే తృప్తి మరెందులోనూ ఉండదన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు కటకం శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు గోపాల్, సభ్యులు పర్వతాల రమేష్ తదితరులు పాల్గొన్నారు .

## మోటార్ సైకిళ్ళు సీజ్



**గూడూరు, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గూడూరు పట్టణంలోని బనిగి సాహెబ్ పేట ప్రాంతంలో గూడూరు టౌన్ , రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు పోలీస్ సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 200 ఇళ్లను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 10 బైక్లను స్వాధీనం చేసుకున్నారు. క్రికెట్ బెట్టింగ్, డిజిటల్ అరెస్ట్, సైబర్ నేరాలు వంటి వాటిపైన అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తం గా ఉండాలని పోలీసులు సూచించారు. ముఖ్యంగా ఆ ప్రాంతంలో విద్యార్థులకు, కొన్ని కుటుంబాలకు నేరాల నియంత్రణ మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టౌన్ , రూరల్ సర్కిల్ ఇన్ స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు మంత్రి నారా లోకేష్ తిరుపతి రాక

### -కీడా ప్రాంగణాలను ప్రారంభించనున్న మంత్రి



**తిరుపతి,ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర విద్యా, సాంకేతిక శాఖ మంత్రి నారా లోకేష్ ఈ నెల 14 మరియు 15 తేదీలలో జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ చంద్రగిరి ఎం ఎల్ ఏ పులివర్తి నానితో కలసి సోమవారం పరిశీలించారు.జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి లోకేష్ 14 న రాత్రి 7.40 గం. లకు తిరుపతి విమానాశ్రయం చేరుకుని తిరుపతి లో రాత్రి బస చేస్తారన్నారు.రెండవ రోజు 15వ తేది ఉదయం 9.15 లకు తిరుపతి గొల్లవాని గుంట లోని ఎన్ టి ఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని అనంతరం 10.40 గం.లకు చంద్రగిరి లోని నూతన మండల పరిషత్ కార్యాలయ భవనం, నారా రామమూర్తి నాయుడు ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లను ప్రారంభిస్తారన్నారు. మధ్యాహ్నం ఒంటి గం.కు రామా నాయుడు కళ్యాణ మండపంలో పార్టీ సమావేశంలో పాల్గొని సా.5 గం.లకు నెల్లూరు బయల్దేరి వెళతారని జిల్లా కలెక్టర్ తెలిపారు.కార్యక్రమ ఏర్పాట్లలో భాగంగా తిరుపతి గొల్లవాణి గుంట లోని నందమూరి తారక రామారావు క్రీడా ప్రాంగణం చంద్రగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయం, ఇండోర్ స్టేడియం, రామానాయుడు కళ్యాణ మండపాలను జిల్లా ఎస్పి ఎల్ సుబ్బరాయుడు, చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని, శాప్ చైర్మన్ రవినాయుడు, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి లతో కలసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట తిరుపతి ఆర్డిఓ రామ్మోహన్, ఏ ఎస్పి రవి మనోహరాచారి, జిల్లా పరిషత్ సీఈవో రవికుమార్, జిల్లా స్పోర్ట్స్ అధికారి శశిధర్, తుడా సెక్రటరీ శ్రీకాంత్, తహసిల్దార్ సురేష్ బాబు, తుడా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, శాప్ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికకు 42 వినతులు : కమిషనర్



**తిరుపతి,ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 42 వినతులు అందినట్లు కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు.డయల్ యువర్ కమిషనర్, పి జి ఆర్ ఎస్ కార్యక్రమాలలో 24 మంది కార్యాలయంకు నేరుగా వచ్చి వినతులు సమర్పించగా, 18 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారన్నారు. కాగా ఇందిరా మైదానం వద్ద టెంకాయల వ్యాపారం చేస్తూ వ్యర్థాలు అక్కడే వేయడంతో దుర్వాసన వస్తోందని స్థానికులు ఫిర్యాదు చేశారు.టిడిఆర్ బాండ్లు ఇప్పించాలని కొందరు కోరారు. గాజువీధిలోని తమ ఇంటి గోడను పగలగొట్టి నిర్మాణాలు చేస్తున్నారని బాధిత కుటుంబం ఫిర్యాదు చేసింది.లక్ష్మీపురం వద్ద విద్యుత్ తీగలమీద చెట్టు కొమ్మలు పడి ప్రమాదకరంగా ఉంది పరిష్కరించాలని స్థానికులు కోరగా అక్కారం పల్లి వద్ద పారిశుధ్యం మెరుగ్గా చేపట్టాలని, లక్ష్మీపురం కూడలి అన్నపూర్ణ హోటల్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులు పరిష్కరించాలని, హీరోహోండా షోరూం వద్ద రోడ్డు బాగుచేయాలని, శ్రీదేవి కాంప్లెక్స్ వద్ద చెట్లు ఎక్కువగా ఉండడంతో దోమలు ఎక్కువగా ఉన్నాయని పరిష్కరించాలని వినతులు,ఫిర్యాదులు అందినట్లు కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, ఏసీపీ లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

## ప్రతి సమస్యను నిర్ణీత గడువులోపు పరిష్కరిస్తాం

### - తహశీల్దార్ రవికుమార్



**సూళ్లూరుపేట, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సూళ్లూరుపేట తడ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి అందిన రెవెన్యూ సమస్యకు నిర్ణీత గడువులోపు పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని తడ మండల తహశీల్దార్ రవికుమార్ అన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. మండల పరిధిలోని గ్రద్దగుంట గ్రామానికి చెందిన కళ్ళత్తూరు వీరాస్వామి చెందిన పిత్రార్జిత స్థిరాస్తి సర్వే నంబర్ 132-2లో 18 సెంట్లు భూమి కొందరు ఆక్రమించారని, సర్వే చేసి హద్దులు చూపించాలని పిజిఆర్ఎస్ లో ఫిర్యాదు చేశారు. అందుకు స్పందించిన తహశీల్దార్ వారు సమర్పించినరి భూమి హక్కు పత్రాలు పరిశీలించి సర్వే చేయిస్తామని తెలియజేశారు. ప్రజల సమర్పించిన ప్రతి అర్జీ ఆన్ లైన్లో రిజిస్ట్రేషన్ చేసి, నిర్ణీత కాలవ్యవధిలోపు పరిష్కరించి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవికుమార్, ఎంపీడీవో, ఐసిడిఎస్ అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్ కండక్టర్ డ్రైవర్ నిజాయితీ



**గూడూరు, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గూడూరు నుండి నెల్లూరు వెళ్తున్న గూడూరు డిపో పల్లె వెలుగు బస్సులో మనుబోలు నుండి నెల్లూరుకు వెళుతున్న ప్రయాణికులు హ్యాండ్ బ్యాగ్ మరిచిపోయారు. ఆ బ్యాగులో 30 వేల రూపాయలు నగదు , సెల్ ఫోన్ ఉన్నాయి. ఇది గమనించిన బస్సు కండక్టర్ సిరాజ్, డ్రైవరు దాసరి నాగార్జున, డిపో మేనేజర్ సి.హెచ్. లక్ష్మికి తెలియపరిచారు. హ్యాండ్ బ్యాగ్ పోగొట్టుకున్న ప్రయాణికులకు హ్యాండ్ బ్యాగ్, నగదు , సెల్ ఫోన్ అందజేశారు. డ్రైవర్ నాగార్జున కండక్టర్ సిరాజ్ లను డి.ఎం. అభినందించారు.

## పన్ను వసూళ్ల లక్ష్యాన్ని అధిగమించిన ఎఎంసి

### - చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్



**నాయుడుపేట, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాయుడుపేట అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ నూరుశాతం పన్ను వసూళ్ల లక్ష్యాన్ని అధిగమించినట్లు ఏఎంసీ చైర్మన్, జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్చార్జి ఉయ్యాల ప్రవీణ్ తెలిపారు. సోమవారం స్థానిక ఏఎంసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరంలో నాయుడుపేట ఏఎంసి పన్ను వసూలు లక్ష్యాన్ని అధిగమించినట్లు ఆయన తెలియజేశారు. ఇందుకు సహకరించిన ఏఎంసీ సిబ్బందికి, డైరెక్టర్లకు, రైతులకు, రైస్ మిల్లర్లకు, మార్కెట్ లైసెన్స్ హోల్డర్లకు, ధాన్యం వ్యాపారులకు ఆయన అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ కిలారి గోపాలకృష్ణ, డైరెక్టర్లు గోను బాబు, కాటూరు కోటేశ్వరరావు, రాయపు కస్తూరి అమ్మ, కామిరెడ్డి కేశవరెడ్డి, సిహెచ్ వేణయ్య, బైనా సుబ్రహ్మణ్యం రెడ్డి, తుపాకుల కన్నెమ్మ,సంచి కృష్ణయ్య, పాలూరు భాస్కర్, వ్యవసాయ శాఖ ఏడి నాగార్జునసాగర్, గ్రేడ్ 1 కార్యదర్శి జివిస్ ప్రసాద్, సహాయ కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, ఏఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా

## జాబ్ మేళా యువత సద్వినియోగం చేసుకోవాలి

### - ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



**శ్రీకాళహస్తి రూరల్, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతిని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీ బుధవారం పట్టణంలోని స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ జాబ్ మేళాకు పదో తరగతి నుండి పీజీ చదివిన అభ్యర్థులు హాజరై ఉద్యోగాలు పొందాలని ఆయన కోరారు. 50 పైగా ప్రముఖ కంపెనీలు రానున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ కంట రమేష్, టిడిపి పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## స్విమ్స్ ఫిజియోథెరపీ కళాశాలలో అతిథి ఉపన్యాసం

**తిరుపతి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) ఫిజియోథెరపి కళాశాల ఆధ్వర్యంలో సోమవారం ఎంపవరింగ్ ఇన్నొవేషన్:రీసెర్చ్ ప్రపోజల్స్ ఫర్ గ్రాంట్ అనే అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు.' స్విమ్స్ ఓ.పి.డి. బ్లాక్ శ్రీ పద్మావతి ఆడిటోరియం లో జరిగిన ఈ కార్యక్రమంలో బెంగళూరు నివమ్హాన్స్‌కు చెందిన న్యూరో కన్సల్టెంట్ (నర్సింగ్) అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గోపీ చంద్రన్ ముఖ్య వక్తగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు/ఉప కులపతి డా॥ ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో సృజనాత్మకత పెంపొందించుకుని, ఎప్పటికప్పుడు కొత్త మెలుకవలు తెలుసుకోవడానికి ఉపయోగకరంగా ఉంటాయన్నారు.ముఖ్య అతిథి డా॥ గోపిచంద్రన్ ఎంపవిరింగ్ ఇన్నొవేషన్:రీసెర్చ్ ప్రపోజల్స్ ఫర్ గ్రాంట్ అనే అంశంపై ప్రసంగిస్తూ స్థానిక వనరులను ఉపయోగించి నూతన ఆవిష్కరణలకు సాధికారత కల్పించడం ద్వారా గ్రామీణ మరియు పట్టణ స్టార్టప్‌ల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.ఆవిష్కర్తలకు మెంటార్‌షిప్, పెట్టుబడి, సాంకేతిక మద్దతు అందించడం ద్వారా కనీసం 5-10 వాణిజ్యపరమైన ఉత్పత్తులు అభివృద్ధి అవుతాయన్నారు.ఈ ప్రయత్నం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచి, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో తోడ్పడుతుందని పవర్ పాయింట్ ప్రజెంటేషన ద్వారా విద్యార్థులకు వివరించారు.ఫిజియోథెరపి ప్రిన్సిపాల్ డా॥ మాధవి మాట్లాడుతూ విద్యార్థులలో ఆలోచన ఇప్పటికే ఉన్నదాని కంటే భిన్నంగా ఉండేందుకు.సామాజిక ప్రభావం, గ్రామీణ ప్రాంతాలు లేదా వెనుకబడిన వర్గాలకు ఈ పరిశోధనలు ఉపయోగకరంగా వుంటుందన్నారు.ప్రస్తుతం 'మేక్ ఇన్ ఇండియా', 'డిజిటల్ ఇండియా', 'స్టార్టప్ ఇండియా' వంటి అంశాలకు సంబంధించిన ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.డా. కె. సెంథిల్ కుమార్ కో-ఆర్డినేటర్ గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపి కళాశాల అధ్యాపకులు డా॥ విశ్వనాథ్, డా॥ శ్రీకుమారి, డా॥ శాంతి, డా॥ గోవర్ధన్, డా॥కవిత, డా॥ సురేష్ కుమార్, డా. జి. కామేశ్వరి, డా. ఎస్. రాఘవకృష్ణ, మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ములకలచెరువు సీఐగా దస్తగిరి

**ములకలచెరువు, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ములకలచెరువు సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా దస్తగిరి సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సిఐ వెంకటేశులు వీఆర్ పై అన్నమయ్య జిల్లా ఎస్పీ కార్యాలయానికి బదిలీ కాగా, మదనపల్లి అన్నమయ్య జిల్లా ఎస్సీ ఎస్టీ సెల్ సీఐగా పనిచేస్తున్న ఈయన బదిలీపై ములకలచెరువు సర్కిల్ కార్యాలయానికి వచ్చారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన నూతన సీఐ దస్తగిరికి పోలీస్ స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్చం అందజేసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ శాంతి భద్రతలను కాపాడుతానని తెలిపారు. అక్రమ మద్యం విక్రయాలు పేకాట కోళ్ల పందాలు గంజాయి విక్రయాలపై ఉక్కు పాదం మోపుతున్నట్లు తెలిపారు. సర్కిల్ పరిధిలో అనే పోలీస్ స్టేషన్లో పెండింగ్లో ఉన్న కేసులను పరిష్కరించి, బాధితులకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

## విద్యార్థులకు సైకిల్ పంపిణీ




**నాయుడుపేట, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఎల్.ఏ సాగరం ఎస్సీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని ఇద్దరు విద్యార్థులకు 786 సేవా సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం అధ్యక్షులు, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేశారు.పాఠశాల హాజరు మార్కులు ప్రవర్తన ఆధారంగా ఉపాధ్యాయులు ఎంపిక చేసిన విద్యార్థులు దొండపూడి ఏంజెల్, చార్లీ కిరణ్ లకు సైకిళ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా షేక్ రఫీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.వచ్చే ఏడాది ప్రతి తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఇద్దరికి మొత్తం 10 మంది విద్యార్థులకు తిరుపతిలోని బ్లూ ల్యాండ్ వాటర్ పార్క్ విహారయాత్రకు తన సొంత నిధులతో పంపిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్ఞాన ప్రసన్న,ఉపాధ్యాయులు పాలేటి చంద్రయ్య,స్కూల్ పేరెంట్ కమిటీ చైర్మన్ సుబ్రహ్మణ్యం,వైస్ చైర్మన్ నజియా, 786 సేవా సంఘం సభ్యులు షరీఫ్, మహమ్మద్, రాంకీ, విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## అశ్వ 2కె26లో విద్యార్థులు నాయకత్వం, ప్రతిభ, సామర్థ్యాన్ని చాటారు

### - మిట్స్ వర్సిటీ ఫౌండర్ , ఛాన్సలర్ డాక్టర్ విజయ భాస్కర్ చౌదరి




**మదనపల్లె/ కురబలకోట, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అశ్వ 2కె26 ద్వారా విద్యార్థులు నాయకత్వం, ప్రతిభ సామర్థ్యాన్ని చాటారని మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ యెన్, విజయ భాస్కర్ చౌదరి అన్నారు. సోమవారం మిట్స్ వర్సిటీ లో అశ్వ 2కె26- జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ విజయోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక నాయకుడిగా నిలిచారని, ఇదే స్ఫూర్తితో ప్రతి సవాలను ఒక అవకాశంగా తీసుకొని ముందుకు సాగాలని దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా ఐఐఎం బెంగళూరు, ఐఐటీ తిరుపతి వంటి సంస్థల్లో అమలు చేస్తున్న విధానాలను పరిశీలించి, ప్లేస్‌మెంట్ టీమ్‌లు, స్పోర్ట్స్ టీమ్‌లు వంటి కార్యకలాపాల్లో రెండవ సంవత్సరం నుంచే చురుకుగా పాల్గొనాలని సూచనలు చేశారు. మిట్స్ యూనివర్సిటీ అవసరమైన సహకారం, వనరులు అందించేందుకు సిద్ధంగా ఉందని, విద్యార్థులు ముందుకు వచ్చి నాయకత్వాన్ని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. టీమ్ స్పిరిట్ అనేది ప్రతి విద్యార్థిలోనూ ఎంతో గొప్ప అనుభూతిని కలిగించిందని విజయ భాస్కర్ చౌదరి పేర్కొన్నారు. మిట్స్ యూనివర్సిటీలో మ్యూజిక్ , డ్యాన్స్ తరగతులను ప్రారంభించనున్నట్లు ప్రకటిస్తూ, ఆసక్తి ఉన్నవారు తమ రెజ్యూమ్‌ను రిజిస్ట్రార్‌కు పంపాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ యువరాజ్ మాట్లాడుతూ మార్చ్ 25 , 26 తేదీలలో రెండు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో మొదటి రోజు రాకాస మూవీ టీం బృందం కొణెదల నిహారిక, హీరో సంగీత్ శోభన్, హీరోయిన్ నయన్ సారిక, గెటప్ శీను, సింగర్స్ సాగర్, మౌనిక యాదవ్, లిప్సిక భాష్యం మరియు రెండవ రోజున హీరో శర్వానంద్, హీరోయిన్ మాళవిక నాయర్, జబర్దస్త్ టీం సద్దాం హుస్సేన్, బిందాస్ భాస్కర్ నవ సందీప్ , జబర్దస్త్ పులి పాల్గొని విద్యార్థులను అలరింపజేశారని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రసంశ పత్రాలను, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మిట్స్ వర్సిటీ ప్రో- ఛాన్సలర్ యెన్ ద్వారకనాథ్, రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్, కన్వీనర్ డాక్టర్ కమల్ బాషా, కో-కన్వీనర్ వై ప్రదీప్ కుమార్, ప్రెసిడెంట్ హర్షవర్ధన్,సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జయరాం రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించండి



**చిత్తూరు,ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అందిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కమిషనర్ నరసింహప్రసాద్ చెప్పారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీజీ ఆర్ఎస్ కార్యక్రమంలో అందే వినతులను క్షేత్రస్థాయిలో విచారించి, పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. గత వారం అందిన వినతుల పరిష్కారంపై సమీక్షించారు. సోమవారం నాటి కార్యక్రమంలో టిడ్కో – 5 , ఇంజనీరింగ్ విభాగం – 4, ప్రజారోగ్య విభాగం – 1, టౌన్ ప్లానింగ్ – 1 చొప్పున మొత్తం 11 వినతులు అందాయి. కార్యక్రమంలో ఎంఈ వెంకటరామి రెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ పి.లోకేష్, ఏసీపీ నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలు నివారణే లక్ష్యం

**- సీఐ రాంభూపాల్**

**పలమనేరు,ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గంగవరం మండలంలోని వైయస్సార్ జంక్షన్ వద్ద ఇటీవల ప్రమాదాలు జరుగుతుండడంతో నివారించడానికి సర్కిల్ ఇన్స్పెక్టర్ రాంభూపాల్ ఆధ్వర్యంలో ఆ సర్కుల వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. ప్రమాదాల నివారణకు జీబ్రా లైన్ ఏర్పాటు చేశారు. బెంగళూరు–తిరుపతి వెళ్లే వాహనాలు అధికం కావడంతో ప్రమాదాల నివారణకు సిగ్నల్ లైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ప్రమాదాలు జరగకుండా చూడడమే మా కర్తవ్యం అన్నారు. రోడ్డు పొడవునా ఎర్రటి పైపులు కూడా ఏర్పాటు చేశామని, ఈ పెయింట్ వలన వాహనదారులకు అక్కడ స్పీడ్ బ్రేకర్ గుర్తించి నెమ్మదిగా పోవడం జరుగుతుందని సిఐ రాంభూపాల్ తెలిపారు.

## అప్పిలేట్ ట్రిబ్యునల్ సమావేశాలకు ఆహ్వానించండి

**- ట్రిబ్యునల్ జిల్లా కమిటి సభ్యులు డాక్టర్ ఎన్.ముని గోపాలకృష్ణ విజ్ఞప్తి**

**- పిజిఆర్ఎస్‌లో వినతిపత్రం సమర్పణ**

**మదనపల్లె, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెలో అప్పిలేట్ ట్రిబ్యునల్ సమావేశాలు ప్రతి మూడు నెలలకు ఒక పర్యాయం నిర్వహించి తమను ఆహ్వానించాలని ఏపి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, అన్నమయ్య జిల్లా ట్రిబ్యునల్ కమిటి సభ్యులు డాక్టర్ ఎన్.మునిగోపాల కృష్ణ కలెక్టరేట్ లో జరిగిన పిజిఆర్ఎస్ లో కలెక్టరుకి వినతి పత్రం అందజేశారు . జిల్లాలో డాక్టర్ మునిరత్నమయ్యను అప్పిలేట్ ట్రిబ్యునల్ లో నియమిస్తూ 2023 – 2026కుగాను సమావేశాలకు హాజరు కావాలని విడుదల చేసిన ఉత్తర్వుల ప్రతిని కలెక్టరుకు అందజేశారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం జరుపవలసి వుందన్నారు. జిల్లా కేంద్రం మదనపల్లెలోనైనా మమ్మలను సమావేశాలకు ఆహ్వానించి నిర్వహించ వలసినదిగా కలెక్టరుని కోరడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు ఒక్క సమావేశం జరుపలేదని గుర్తుచేస్తూ, అన్నమయ్య జిల్లాకు రైల్వే అసిస్టెంట్ డైరెక్టరును నియమించాలని విజ్ఞప్తి చేశారు.

## మహిళల భాగస్వామ్య పెంపుకే రిజర్వేషన్

**సత్యవేడు, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మహిళల భాగస్వామ్యాన్ని పెంపుకే మహిళా రిజర్వేషన్ ప్రవేశపెట్టినట్టు తిరుపతి జిల్లా, సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శామ్యూల్ అరవింద్ చెప్పారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత, ఎన్ఎస్ఎస్ విభాగం, హరి ప్రసాద్ ఆధ్వర్యంలో స్త్రీశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ. మహిళా రిజర్వేషన్ బిల్లు.. లోక్‌సభ, అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం సీట్లను రిజర్వ్ చేసే చారిత్రాత్మక చట్టమన్నారు. 2023 సెప్టెంబర్‌లో పార్లమెంటులో ఈ బిల్లు ఆమోదం పొందిందన్నారు. 15 ఏళ్ల పాటు ఉండే ఈ బిల్లులో ఎస్సీ ఎస్టీ మహిళలకు కూడా రిజర్వేషన్ వర్తిస్తుందన్నారు.మహిళలకు రిజర్వ్ చేయబడిన సీట్లు రొటేషన్ మార్పు చేయబడతాయన్నారు. దీంతో రాజకీయాల్లో లింగ సమానత్వాన్ని సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రవిశంకర్, వెంకటేశ్వర్లు,ఎం హరిప్రసాద్, మురళీమోహన్, సుధాకర్, ఈశ్వరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## దళిత మహిళకు న్యాయం చేయాలి

**కడప, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పుల్లారెడ్డి పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో గత ఏడు ఏళ్లుగా ఆయాగా పనిచేస్తున్న జె.సుశీలమ్మ అనే దళిత మహిళకు అధికారులు, పాఠశాల సిబ్బంది అన్యాయం చేస్తున్నారని ఎస్సీ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు విలియమ్ కలమల మిట్ట మండిపడ్డారు. ఆమె స్థానంలో వేరొక ఓసీ సామాజిక వర్గానికి చెందిన లక్ష్మీదేవి అనే మహిళను నియమించాలనే కుట్రతోనే విధులకు ఆటంకం కలిగిస్తున్నారని ఆరోపించారు.

## రెవెన్యూ అంశాలపై సమీక్షా సమావేశం

**- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్**

**పుట్టపర్తి , ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలులో రెవెన్యూ, భూ రికార్డుల ప్రక్షాళనపై ఉన్నత స్థాయి కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు కీలక ఆదేశాలను జారీ చేసారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యంపై ఆయన సీరియస్ అయ్యారు. ముఖ్యంగా ముదిగుబ్బ (71), కదిరి (03), బుక్కపట్నం (01) తహశీల్దార్ల లాగిన్లలో గడువు దాటిన ఫిర్యాదులను పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న భూ రీ–సర్వే పనులను వేగవంతం చేయాలని, నెలాఖరుకు నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని ఆర్డీఓలను ఆదేశించారు. రీసర్వేలో ఉమ్మడి ఎల్పీఎంలు ఉండకూడదని కలెక్టర్ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు , సర్వే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీలో ధర్మవరం, కదిరి, కొత్తచెరువు మండలాలు నూరు శాతం లక్ష్యాన్ని చేరుకున్నాయి. జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ కోర్ట్ కాంప్లెక్స్ నిర్మాణానికి పుట్టపర్తి మండలంలోని కప్పలబండ, బీడుపల్లి గ్రామాల్లో భూమిని గుర్తించడం జరిగింది. హిందూపురం, కదిరి ప్రాంతాల్లో కోర్టు భవనాలకు స్థల పరిశీలన పూర్తయ్యిందన్నారు. పరిశ్రమల స్థాపనకు సంబంధించి ఏపీఐఐసీకి కేటాయించిన భూముల మ్యుటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ వన్' ద్వారా భూ రికార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగ నిర్వహించాలని, పెండింగ్‌లో ఉన్న నిషేధిత జాబితా అంశాలను పరిష్కరించాలని ఆదేశించారు.

# పిహెచ్‌సిలకు ఇంటర్నెట్ కనెక్షన్

**- కలెక్టర్ సుమిత్ కుమార్**



**చిత్తూరు, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కలెక్టర్ నిధులతో ఒక్కొక్క పిహెచ్‌సికి రూ. 25 వేలతో ఇంటర్నెట్ కనెక్షన్ కేటాయించడం జరుగుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టర్ సమావేశ మందిరంలో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గ పిహెచ్‌సి స్టాఫ్‌నర్స్‌కు సంజీవని ప్రాజెక్టుపై సమావేశం నిర్వహించారు. వారం లోపు ఇంటర్నెట్ అలాట్ చేస్తామన్నారు. దీంతో అభా ఐడి క్రియేషన్ సులభం అవుతుందన్నారు. అన్ని రకాల రిపోర్ట్స్, పేషంట్స్ రిజిస్ట్రేషన్ అప్ డేట్ చేయాలన్నారు. ఓపికి వచ్చిన ప్రతి పేషెంట్ ను తప్పని సరిగా రిజిష్టర్ లో నమోదు చేయాలని సాయంత్రం నాలుగు తర్వాత వచ్చే పేషెంట్లు తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. పిహెచ్సి లో నాలుగు లాగిన్స్ పిసిసి, స్టాఫ్ నర్స్, డాక్టర్, ఎల్టి, ఫార్మసిస్ట్ తప్పనిసరిగా అందరూ ఓపి పేషెంట్స్ కు 100 శాతం చేయాలని ఆదేశించారు. సంజీవని ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ కొరకు మీ వంతు సహకారం అందించాలని ఆదేశించారు. తద్వారా సులభంగా వెనకటికి పేషెంట్స్ కు చికిత్స ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రజలకు దీర్ఘకాలిక వ్యాధుల గురించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ తమ వంతు కృషితో అందరికీ మంచి ఆరోగ్యం దిశగా పయనిద్దాం అన్నారు. ఎఈ కార్యక్రమంలో డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఏ నాగ శశిభూషణ్ రెడ్డి, డిఎస్ఓ డాక్టర్ గిరి, చిత్తూరు, పూతలపట్టు కన్సల్టెన్సీ పిహెచ్సి స్టాఫ్ నర్సులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ విక్రయాలను ప్రశ్నించినందుకే కేసులు

**- థియోసాపికల్ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి**

**- ఏపీ మొదలియార్ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు బుల్లెట్ సురేష్**




**చిత్తూరు, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలోని ఆర్టీసీ కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న థియోసాఫికల్ సొసైటీ భూముల అక్రమ విక్రయాలను ప్రశ్నించినందుకే ప్రశ్నించినం దుకే తనపై కేసులు బనాయించారని ఏపీ రాష్ట్ర మొదిలియార్ సంక్షేమ సంఘం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు బుల్లెట్ సురేష్ తెలిపారు. సోమవారం స్థానిక కట్టుకాలువ వీధిలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 15 రోజుల క్రితం థియోసోఫికల్ సొసైటీ భూములను వైకాపా పార్టీకి చెందిన ఓ లారీ క్లీనర్, మరి కొంత మంది ఆక్రమించుకొని విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న తంతును తాను మీడియా సమావేశంలో వెల్లడించానని తెలిపారు. సొసైటీ భూముల అక్రమ కొనుగోలు, విక్రయాలపై తాను కోర్టులో దావాలు వేసి నిలిపేందుకు ప్రయత్నించడంతోనే తనపై ఆరోపణలు చేస్తూ, అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 150 కోట్ల విలువచేసే సొసైటీ భూములను దోచేందుకు కొంతమంది ప్రయత్నించడంతో తాను ఆధారాలు సేకరించి కోర్టులో కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.. ఈ నేపథ్యంలో ఏలాంటి తప్పు చేయకుండా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. బనాయించడంలో నగరానికి చెందిన ఒక టీవీ న్యూస్ ఛానల్ ప్రతినిధి ప్రమేయం ఉందన్నారు. తాను కేసులకు భయపడబోనని, న్యాయస్థానం ద్వారానే సమర్థవంతంగా ఎదుర్కొని తిప్పి కొడతానన్నారు. తన ఇంటిలో జరిగిన వరుస దొంగతనాలు, తనపై నమోదు చేసిన అక్రమ కేసులకు సంబంధించి తాను కాణిపాకంలో ప్రమాణానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు సార్వత్రిక ఎన్నికల సందర్భంగా చిత్తూరు నియోజకవర్గానికి సంబంధించి వైకాపా నియమించిన ఇంచార్జ్ పోకడల కారణంగానే తాను పార్టీకి దూరమైనట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, బుల్లెట్ సురేష్ తనయులు సాయి బాలాజీ అలియాస్ అప్పు, ప్రశాంత్ పాల్గొన్నారు.

## అర్జీలను సకాలంలో పరిష్కారించాలి

**- కలెక్టర్ నిశాంత్ కుమార్**

**మదనపల్లె, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పిజిఆర్ఎస్ కు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో అర్జీదారుల నుండి కలెక్టర్, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, జి ఎస్ డబ్ల్యూ ఎస్ లక్ష్మీపతి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్‌ల అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లేకుండా పరిష్కరించి, గ్రీవెన్స్ పై ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అర్జీలను గడువులోపు పరిష్కారం చూపాలన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ సమస్యలపై 392 అర్జీలను రాగా, గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూర్ బాష దూదేకుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శిగా నజీర్

**చింతకొమ్మదిన్నె , ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కడప జిల్లా లోని నూర్ భాష సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గగ్గుటూరి నజీర్. ఆదివారం కడప నగరంలోని దూదేకుల భవన్లో నూతన నూర్ భాష దూదేకుల సంక్షేమ సంఘం 159/83 నూతన జిల్లా అధ్యక్షునిగా వెంకట ప్రసాద్ ప్రధాన కార్యదర్శిగా గుంటూరు నజీర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూదేకుల సంఘానికి ప్రభుత్వాల నుండి రావలసిన రాయితీలన్నీ తెచ్చేందుకు కృషి చేస్తామని వారు తెలియజేశారు.

## 'కాటసాని' వైద్య సేవలు అభినందనీయం

**- డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య**

**కడప , ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలోని అంజలి హోమియో స్టోర్ కాటసాని మనోహర్‌రెడ్డి అంది స్తున్న వైద్య సేవలు అభినందనీ యమని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. ఆదివారం పోతుల కంచమ్మ, ఓబుల్‌రెడ్డి, సరస్వతమ్మ మెమోరియల్ ట్రస్టు, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటి సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆయన మాట్లాడారు. పేదలు, నిస్సహాయులు, వ్యాధుల బారిన పడి మంచానికే పరిమితమైన వారికి కాటసాని ఉచిత వైద్య సేవలు అందిస్తుండడం ప్రశంసనీ యమన్నారు. చక్కెర వ్యాధిని నియంత్రణలో ఉంచేందుకు ఆయన కొత్త ఔషధాన్ని అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కాటసాని మనోహర్ రెడ్డి ,పోతుల శివరామి రెడ్డి, రిజర్వుడు ఎఎస్ఐ కొండారెడ్డి, వివిధ సంఘాల నాయకులు కె. వి. రమణారెడ్డి, డా. వెల్లాల వెంకటేశ్వరాచారి, గొబ్బూరి కోటేశ్వరరావు, బి. గోపికృష్ణ, వెంకటేష్, సాయి, హేమంత్, ఎల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## వేలం పాటల ద్వారా రూ.5.75 లక్షలు ఆదాయం

**ములకలచెరువు , ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వారపు సంత, డైలీ మార్కెట్ వేలంపాట ద్వారా ములకలచెరువు గ్రామపంచాయతీకి రూ. 5.75 లక్షలు ఆదాయం లభించింది. ములకలచెరువు మండల కేంద్రంలోని స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం వారపు సంత, డైలీ మార్కెట్ నిర్వహించుకునేందుకు గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీవో హరినారాయణ ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ బహిరంగ వేలంలో మొలకల చెరువుకు చెందిన సరసమ్మ వారపు సంత రూ. 2.90 లక్షలు, డైలీ మార్కెట్ ను పాత ములకలచెరువుకు చెందిన విజయ్ కుమార్ రూ.2.85 లక్షల రూపాయలను వేలంపాట ద్వారా పాడుకున్నారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ పంచాయతీకి వారపు సంత డైలీ మార్కెట్ ద్వారా వచ్చిన నిధులను గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం, సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్ ప్రతాప్, పంచాయతీ కార్యదర్శులు సుధాకర్, ఆజాద్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధప్ప , టిడిపి నాయకులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## చలివేంద్రం ఏర్పాటు

**చంద్రగిరి,ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నాంది స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ పసల ప్రసాద్ ఆధ్వర్యంలో చంద్రగిరి పోలీస్ స్టేషన్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. సిఐ సురేష్ కుమార్ చేతులు మీదుగా సోమవారం పోలీస్ స్టేషన్‌లో చలివేంద్ర ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా నాంది స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ పసల ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్, మెంబర్స్ యువూరి వెంకటయ్య, డాక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



# చిత్తూరు జిల్లా

## న్యాయవాదులకు రక్షణ చట్టం అవసరం!

**- రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వి. ఆర్. రెడ్డి.!**



**పలమనేరు,ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** న్యాయవాదులకు రక్షణ చట్టం అవసరమని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వి. ఆర్.రెడ్డి అన్నారు.ఇటీవల జరిగిన రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలలో సభ్యుడిగా ఎన్నికైన వి.ఆర్.రెడ్డి సోమవారం పలమనేరు బార్ అసోసియేషన్‌కు వచ్చారు. బార్ అసోసియేషన్ సభ్యులు ఆయన్ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు రెండవసారి న్యాయవాదులకు సేవ చేసే అవకాశం కల్పించి రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదుల సమస్యలు పరిష్కారంలో నేను రాజీలేని పోరాటం చేస్తానని, న్యాయవాదులకు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. న్యాయవాదులకు ఇళ్ల పట్టాలు, ఇన్సూరెన్స్, వెల్ఫేర్ ఫండ్, రిటైర్మెంట్ బెనిఫిట్ తదితర అంశాలపై తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావడానికి తీవ్రంగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఇర్షాద్ అలీఖాన్, మాజీ అధ్యక్షులు ఎల్. భాస్కర్, ఉపాధ్యక్షులు, కృష్ణమూర్తి, కోశాధికారి మునిరాజులు, మాజీ ఉపాధ్యక్షులు షేక్ షరీఫ్, చంద్ర శేఖర్, సీనియర్ న్యాయవాదులు పి. పరమశివప్ప,కె.లక్ష్మీపతి, బి.మోహన్ రెడ్డి,బి.రాజా రెడ్డి, ఎస్. లక్ష్మణ్ రెడ్డి,ఇ.కృష్ణప్ప, ఆరిఫుల్లా ఖాన్,నారాయణ రెడ్డి, ఇబ్రహీం, కె.రంజిత్ కుమార్, అశోక్,మహేశ్వరి,మాధవి ల తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## చెత్త వ్యర్థాల కేంద్రానికి భూమి పూజ



**పలమనేరు, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పురపాలక సంఘ పరిధిలోని గబ్బిళ్ళ కోటూరులోని కంపోస్టు యార్డ్ లో ఏపీ ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో తడి చెత్త పొడి చెత్త వ్యర్థాల శద్ధి ఏర్పాటు కేంద్రానికి మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... స్వచ్ఛంద కార్పొరేషన్ వారిచ్చే ఈ ప్రొక్యూట్మెంట్ ద్వారా పలమనేరు పురపాలక సంఘం పరిధిలోని తడి పొడి వ్యర్థాల నిర్వహణకు సెక్యూరిటీ గార్డ్ సర్వీస్ (లీడ్ ముంబేర్ ) రఘురాం హ్యూమ్ పైప్స్ ప్రైవేట్ లిమిటెడ్ గుంటూరు, హైదరాబాద్ వారిచే నిర్వహించబడుతుందని ఈ కార్యక్రమం ద్వారా పురపాలక సంఘ పరిధిలో తడి, పొడి చెత్త రోజుకు 20 టన్నులు నిర్వహించి మే 2026 చివరకు పూర్తిస్థాయిలో తడి పొడి చెత్త వ్యర్థాలను శుద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ కుమారి శిరీష, సానిటరీ ఇన్స్పెక్టర్ బాబు రెడ్డి నాయక్, పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్త్రీ శక్తి కార్యక్రమ నిర్వహణ




**పలమనేరు, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్థానిక ఎస్.వి.సి.ఆర్ కళాశాల లో ఏపీ సి సి ఈ వారి ఉత్తర్వుల మేరకు ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేసులు ఆదేశానుసారం కళాశాల ఆంగ్ల శాఖధిపతి సురేష్ కుమార్ సమన్వయకర్తగా స్త్రీ శక్తి కార్యక్రమ నిర్వహణ జరిగింది. ఈ కార్యక్రమానికి వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నందీశ్వరయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీ సాధికారతలో మూడు దశలు ఉన్నాయని దశల వారీగా దానికి సాధించి సమాజాభివృద్ధిని సాధించాలని ప్రభుత్వం అందించే స్త్రీ సంక్షేమం ద్వారా రాష్ట్రంలోని స్త్రీలు సాధికారత పొందాలని తెలిపారు. డాక్టర్ హేమలత మాట్లాడుతూ... మహిళా రిజర్వేషన్ ద్వారా మహిళ సాధికారత సాధ్యమవుతుందన్నారు. డాక్టర్ వెంకటేష్ బాబు మాట్లాడుతూ... దేశ చరిత్రలో మహిళ పాత్ర అమూల్యమైందన్నారు. విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు గురు ప్రసాద్, హెచ్ ఓ డి ఫిజిక్స్, డాక్టర్ ఈ వాసు, హెచ్ ఓ పి తెలుగు డాక్టర్ అమీర్ భాష, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## సూర్యఘార్ ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు మేలు

**- ప్రతి ఇంటిపై సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోండి**

**- ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి**



**పుట్టపర్తి,ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పీఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజిలి యోజన పథకం ద్వారా ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులు సోలార్ విద్యుత్ ఉచితంగా పొందవచ్చునని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాల్టీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ ముఫ్తీ బిజిలి యోజన పథకాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. అంతకు ముందు బ్రాహ్మణపల్లి తండాలో కళ్యాణబాయి, గోపాల్ నాయక్ ఇంటిపై సోలార్ సూర్య ఘర్ ప్యానల్ ను ప్రారంభించారు. బ్రాహ్మణపల్లి మారెమ్మ గుడి వద్ద విద్యుత్ అధికారులు ఈ ఈ శివ రాముడు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, పీఎం సూర్య ఘర్ పథకం ద్వారా ఎస్సీ ఎస్టీ వర్గాలకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించడం కేంద్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి ఇంటిపై సౌర ప్యానెల్లు ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ ఖర్చులు తగ్గడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఒక్కో ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులకు రెండు కిలో వాట్ల సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకుంటే రూ.లక్షా 20వేలు ఆ కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ సోలార్ రాష్ట్రంగా మారుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా సుపరిపాలన సాగుతోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ప్రజలకు నెరవేర్చిందని దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని విధంగా ఆంధ్రప్రదేశ్లో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు .భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 100 వ జయంతి వేడుకల సందర్భంగా పుట్టపర్తికి దేశ విదేశాల నుంచే కాక, దేశ రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి , ప్రధాని గవర్నర్లు న్యాయమూర్తులు, ముఖ్యమంత్రులు, పలువురు వీఐపీలు పెద్ద ఎత్తున తరలివచ్చి పుట్టపర్తి ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. బాబా వేడుకలు సందర్భంగా పుట్టపర్తిలో రహదారుల అభివృద్ధితోపాటు నియోజకవర్గంలో 26 కోట్లతో సీసీ రోడ్లు 34 కోట్లతో రహదారుల నిర్మాణం వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టిన ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పిలుపునిచ్చారు. లబ్ధిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వ రాయితీలను పొందాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డివిజన్ ఈఈ శివరాముడు ,స్థానిక నాయకులు కూటమి పార్టీల నాయకులు టిడిపి కన్వీనర్ బోయ రామాంజనేయులు సాముకోటి ఆదినారాయణ, మాజీ చైర్మన్ బెస్త చలపతి ,వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఓలిపి శ్రీనివాసులు, అంబులెన్స్ రమేష్, శ్రీరామ్ నాయక్ , కృష్ణ ప్రసాద్ ,సురేష్ చౌదరి అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చట్ట పరిధిలో బాధితులకు సత్వర న్యాయం

### - ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



**మదనపల్లె, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చట్ట పరిధిలో బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నామని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ నిర్వహించారు. ప్రజల సమస్యలను నేరుగా విని, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భూ, ఆస్థి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసాలు, ప్రేమపేరుతో మోసాలు, ఇతర సమస్యలపై ఎస్పీ స్వయంగా విచారించారు. ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, చట్టపరిదిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు చేపట్టాలని, ఆలస్యం చేయొద్దని ఆదేశించారు. చట్టపరమైన చర్యలు తీసుకున్న వెంటనే, వివరాలతో కూడిన నివేదికలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని స్పష్టం చేశారు.

## భవిత కేంద్రంలో పీజీయో థెరపీ సేవలు

**కంభంవారిపల్లి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కె. వి పల్లి మండలం భవిత కేంద్రంలో ప్రతి సోమవారం పీజీయో థెరపీ సేవలు అందించనున్నట్లు తెలిపారు. డాక్టర్. కోమల ఆధ్వర్యంలో పీజీయో థెరపీ చేస్తున్నట్లు మండల విద్యా శాఖ అధికారులు పి.రెడ్డి భాష , కె. సుబ్రమణ్యం రెడ్డి తెలియచేశారు. ఈ కేంద్రంలో పీజీయో థెరపీ అవసరమైన సెబ్రిల్ పాలసీ, లోకో మోటర్ వైకల్యం, శారీరక ఎదుగుదల సమస్యలు, పోలియో కండరాల క్షీణత,పుట్టుక తో వచ్చే వైకల్యాలు, వెన్నుముక సమస్యలు, కీళ్ల నొప్పులు, బిగుతూ వంటి సమ స్యలు, విద్యార్థులకు పీజీయో థెరపీ చేస్తున్నట్లు తెలియచేశారు . ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు కోరారు.

## ఫేక్ డాక్యుమెంట్లతో భూ కబ్జా

### - కలెక్టర్‌కు బాధితులు ఫిర్యాదు



**మదనపల్లె, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మొటుకుపల్లి శివ అనే వ్యక్తి తన భూమిని కబ్జా చేసి తమకు అన్యాయం చేశాడని పఠాన్ గౌస్, పఠాన్ మహబూబ్ బాషా సోమవారం మదనపల్లె కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బి.కొత్తకోట మండలం, గట్టు గ్రామం, బద్దెపల్లి లో వారసత్వంగా 22 /54- 2Aలో 3.75 సెంట్లు, 22/58- 2 లో 1 ఎకరా 16 సెంట్లు ఉన్నామన్నారు. అయితే ఆ భూమికి ఫేక్ డాక్యుమెంట్లు క్రియేట్ చేసి, మొటుకుపల్లి శివ కబ్జా చేయడమే కాకుండా భూమిని చదును చేస్తున్నాడని బాధితులు వాపోయారు.

## భూ వివాదాలకు పరిష్కారం

### - రైతులకు 1.బి. పత్రాల పంపిణీ - పారదర్శక సేవలే లక్ష్యం

### - కలెక్టర్ నిశాంత్ కుమార్




**మదనపల్లె, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ వెబ్‌ల్యాండ్ సమస్యలకు జిల్లా యంత్రాంగం వేగంగా పరిష్కారం చూపుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక చర్యల ఫలితంగా, మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలో ఏళ్లుగా పరిష్కారం కాని వెబ్‌ల్యాండ్ సంబంధిత సమస్యలను పరిష్కరించి, సంబంధిత రైతులకు 1బి (అడంగల్) పత్రాలను మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పి.జి.ఆర్.ఎస్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో, వెబ్‌ల్యాండ్ సమస్యలు పరిష్కరించిన ఇద్దరు రైతులకు కలెక్టర్ స్వయంగా 1బి పత్రాలను అందజేశారు. అనేక సంవత్సరాలుగా సర్వే నంబర్ సవరణలు, కొత్త సర్వే నంబర్ల చేర్పులు, అడంగల్ వివరాల సరిదిద్దడం వంటి సమస్యలతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులకు ఈ చర్యల ద్వారా ఊరట లభించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మదనపల్లి సబ్ డివిజన్ పరిధిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత పాత రికార్డులు, దస్త్రాలను సమగ్రంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించామని తెలిపారు. ముఖ్యంగా మూడు నుంచి ఐదు ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కారం కల్పించేందుకు యంత్రాంగం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. భూమి రికార్డులు సరిగ్గా ఉండటం రైతులకు అత్యంత కీలకమని, పంట రుణాలు, భూమి లావాదేవీలు, ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడంలో వెబ్‌ల్యాండ్ రికార్డులు ముఖ్య పాత్ర పోషిస్తాయని కలెక్టర్ వివరించారు. రికార్డుల్లో ఉన్న లోపాలను సరిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడమే జిల్లా పరిపాలన ప్రధాన లక్ష్యమని తెలిపారు. మిగిలిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని, రెవెన్యూ శాఖ అధికారులు బాధ్యతతో పనిచేసి ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా మదనపల్లె మండలం, రెడ్డివారిపల్లెకు చెందిన రైతు గంగులప్ప, కురబలకోట మండలం, తెట్టుకు చెందిన రైతు చిన్నప్పలకు 1బి పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## మదనపల్లె మున్సిపల్ ఆర్ఓ పల్లవికి అరెస్ట్ వారెంట్

### - ఈ నెల 30న విచారణకు హాజరు కావాలని కోర్టు ఆదేశాలు



**మదనపల్లె, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్యజిల్లా బి.కొత్తకోట మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసి ప్రస్తుతం మదనపల్లె మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ (ఆర్ఓ) జీవి.పల్లవి అరెస్ట్ కు హైకోర్టు ఈ నెల 2న ఉత్తర్వు జారీ చేసింది. ఆమెను అరెస్ట్‌చేసి ఈనెల 30న న్యాయస్థానం ముందు హాజరుపర్చాలని ఎస్పీని ఆదేశించింది. మున్సిపాలిటీలో ఒక వ్యక్తి ప్లాన్ అప్రూవల్ లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టారని, అక్రమంగా జరుగుతున్న ఈ పనిని కమిషనర్ అడ్డుకోలేదని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చూపారని ఆరోపిస్తూ రెడ్డెప్ప అనే వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు నడుస్తుండగా విచారణ కోసం పల్లవి ఆన్ లైన్‌లో హాజరు కావాలని తెలియజేసినా ఆమె హాజరు కాలేదని కోర్టు దృష్టికి వచ్చింది. దీన్ని కోర్టు ధిక్కారంగా భావిస్తూ ఆమెకు బెయిలబుల్ వారంట్ ను జారీ చేయాలని న్యాయ స్థానం ఆదేశించింది. ఈనెల 30 జరిగే తదుపరి విచారణ రోజు ఆమె కోర్టు ఎదుట హాజరుకావాలని ఆదేశించింది. అరెస్ట్ చేస్తే రూ.10వేల బాండు, ఇద్దరి పూచికత్తుపై బెయిల్ ఇవ్వాలని న్యాయస్థానం సూచించింది. 30న జరిగే కేసు వాయిదాకు హాజరవుతానని, కోర్టు ఆదేశించే వరకు హాజరవుతానని ఆమె ప్రమాణపత్రం ఇవ్వాలని ఆదేశాల్లో న్యాయస్థానం పేర్కొంది.

## మదనపల్లె డీఎస్పీగా బాధ్యతల స్వీకరణ

### - జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డీఎస్పీ



**మదనపల్లె, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లె పోలీస్ సబ్ డివిజన్ నూతన డీఎస్పీగా బి.పావని సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆమె జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ కి పూలమొక్కను అందజేసి విధుల్లో చేరినట్లు తెలిపారు. డీఎస్పీకి ఎస్పీ శుభాకాంక్షలు తెలుపుతూ, ట్రాఫిక్ సమస్య, సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణపై దిశానిర్దేశం చేశారు. అనంతరం డిఎస్పీ జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) వెంకటాద్రి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, శాంతిభద్రతల పరిరక్షణలో రాజీ పడబోనని ఆమె తెలిపారు.

## సొంతిల్లు కట్టించలేక పోతే అద్దెలు చెల్లించాలి


### - ధర్నాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి




**మదనపల్లె, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కూటమి ప్రభుత్వ ఏర్పడి రెండేళ్లవుతున్నా ఎన్నికల వాగ్దానాలు నెరవేర్చలేదని, నిరుపేదలకు సొంత ఇంటి కల నెరవేర్చలేక పోతే వారి ఇంటి అద్దెలు ప్రభుత్వమే చెల్లించాలని సీపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. తమకు అధికారం ఇస్తే పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామాలలో మూడు సెంట్లు జాగా, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తానని చెప్పిన చంద్రబాబు మాటలు నీటి మీద రాతలుగా మారాయని విమర్శించారు. కొత్త పించన్లు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో రామానాయుడు, మహేష్, సంతోష్ కుమార్, టి.కృష్ణప్ప, మనోహర్ రెడ్డి, సాంబశివ, సిద్ధిగల శ్రీనివాసులు, సుమిత్రమ్మ, టీ ఎల్ వెంకటేష్, కోటేశ్వరరావు, ఒంగిమల్ల రంగారెడ్డి, సలీం బాషా, జక్కల వెంకటేష్, హరికుమార్, తరుణ్, రెడ్డి శేఖర్, నరేష్, సూరి, తిరుమల, దేవా, రఘునాథ్, అంజనప్ప, జగన్ బాబు, అంజి ఓబులేసు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ నియంత్రణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### - అడిషనల్ డి.ఎం.హెచ్.ఓ డాక్టర్.ఎల్ రాధిక





**మదనపల్లె, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎయిడ్స్ నియంత్రణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డిస్ట్రిక్ట్ అడిషనల్ డి.ఎం హెచ్.ఓ. డాక్టర్ ఎల్. రాధిక హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రాధమిక ఆరోగ్య కేంద్రం ఐసిటిసి ల్యాబ్ టెక్నీషన్లతో , ఐ సి టి సి కౌన్సిలర్స్, ఎఆర్టీ డాక్టర్ తో సోమవారం ఎయిడ్స్ నియంత్రణ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మిషన్ ఎయిడ్స్ సురక్ష (మాస్) కార్యక్రమం లో భాగంగా జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ భాస్కర్ వేంపల్లి మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ సేవలు అందించాలని స్పష్టం చేశారు.జిల్లాలో అందరూ సమన్వయంతో పని చేస్తే ఎయిడ్స్ వ్యాప్తిని నియంత్రించవచ్చని తెలిపారు. జిల్లాలోని సబ్సెంటర్లలో హెచ్ఐవి స్క్రీనింగ్ లక్ష్యాలను 95 శాతం వరకు చేరుకోవాలని, హెచ్ఐవి ఉన్న వారిలో 95 శాతం మందికి చికిత్స అందించాలన్నారు. వైరల్ లోడ్ నియంత్రణలో 99 శాతం లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రైవేట్ రంగంలో అదే స్థాయిలో సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ భాస్కర్, వైద్యులు, టి ఐ సిబ్బంది, దిశ స్టాఫ్, జయ కుమార్ ప్రసాద్, సిలార్, ఆనంద్, చంద్ర ఇతరులు పాల్గొన్నారు.

## బహిరంగ వేలం

**రామసముద్రం, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని చెంబకూరు గ్రామ పంచాయతీలో వారపుసంత, దినసరి మార్కెట్, బస్టాండ్ గేటు హక్కుల కోసం ఈ నెల 16వ తేదీ గురువారం 11 గంటలకు పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రెడ్డి శేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమం ఎంపిడివో లతీఫ్ ఖాన్, డిఎల్పివో నాగరాజు, డిప్యూటీ ఎంపిడివో క్రిష్ణవేణి ఆధ్వర్యంలో జరుగనుంది. పాటలో పాల్గొనే వారు వారపుసంత, దినసరి మార్కెట్‌కు రూ.1 లక్ష, బస్టాండ్ గేటుకు రూ.50 వేల డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. హెచ్చు మొత్తంతో గెలిచిన వ్యక్తి డిపాజిట్ మినహా మిగతా మొత్తాన్ని వెంటనే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వేలం హక్కు పొందిన వారికి 2026 ఏప్రిల్ 1 నుంచి 2027 మార్చి 31 వరకు గడువు వర్తిస్తుందని, పంచాయతీకి ఎలాంటి బాకీలు ఉండకూడదని స్పష్టం చేశారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలి



**రామసముద్రం,ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండలంలోని యారపశెట్టిపల్లి గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారం ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామానికి చెందిన సర్వే నంబర్ 6/4లోని 4.11 ఎకరాల ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన జి.నారాయణ రెడ్డి జెసిబి, ట్రాక్టర్లతో చదునుచేసి అక్రమంగా ఆక్రమించుకున్నారని గ్రామస్థులు ఆరోపించారు. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన గ్రామస్థులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. గ్రామస్థులు మాట్లాడుతూ, ఈ భూమి ప్రభుత్వానికి చెందినదిగా ఉండి గ్రామంలోని నిరుపేద ఎస్సీ, బీసీ కుటుంబాలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు లేదా కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేటాయించాలని పలుమార్లు కోరినా అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది వ్యక్తులు అధికారం దుర్వినియోగం చేస్తూ భూమిని కబ్జా చేయడం దురదృష్టకరమని విమర్శించారు. అనంతరం గ్రామస్థులు తహసీల్దార్ మహమ్మద్ అజారుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించి, వెంటనే స్పందించి భూమిని స్వాధీనం చేసుకుని కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భూమిని పేదల సంక్షేమం కోసం వినియోగించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



# అన్నమయ్య జిల్లా

## మహిళా సాధికారతకు పౌరులు సహకరించాలి

### - ప్రిన్సిపాల్ డాక్టర్. శ్రీదేవి




**మదనపల్లె, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు దేశ పౌరులందరూ మహిళా సాధికారతకు సహకరించాలని బిటి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. శ్రీదేవి తెలిపారు. సోమవారం పట్టణంలోని బిసెంట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్త్రీ శక్తి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ నిర్దేశాల మేరకు కో-ఆర్డినేటరుగా డాక్టర్ దేరంగుల శ్రీనివాసులు, మహిళా అధ్యాపకులు బి.కృష్ణవేణి, బి.సాలమ్మ కార్యక్రమాన్ని నడిపించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మహిళలు ప్రతి రంగంలోను రాణించాలని ఆకాంక్షించారు. వక్తలందరూ నారీ శక్తి వందన్ అధినియమం- 2023 చక్కగా అమలై దేశంలో సంపూర్ణంగా మహిళా సాధికారత సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో కళాశాల ఉపాధ్యక్షులు డాక్టర్ మలిగి రాఘవరెడ్డి, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ శైలజ, సి.ఎస్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



**పీలేరు,ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నేషనల్ హైవే అధికారులు ఆర్ఓబి పనులు చేపట్టడంతో పీలేరు పట్టణం నడిబొడ్డులో ఉన్న రైల్వే గేటు మూసివేసి పనులు చేపట్టారు. ట్రాఫిక్ సమస్య పెరిగిపోవడంతో ప్రత్యామ్నయం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులకు త్వరలో ఉపశమనం కలుగనుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కమలాకర్ రెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ నాయక్, తెలుగుదేశం పార్టీ దొడ్డిపల్లి గ్రామం ఇంచార్జ్ నారే సతీష్ రెడ్డి పనులు ప్రారంభించారు. సదుం రోడ్డు మార్గాన వాహనాలు రాకపోకలకు అంతరాయం కలుగకుండా, పాత బస్టాండు వైపు రాకుండా కొత్తపేట దగ్గర నుండి పించా నది పై నుండి చిత్తూరు రోడ్డు మార్గం నుండి పట్టణంలోకి వెళ్లడానికి గతంలో చిన్న వంతెన నిర్మించి ఉన్నారు. వర్షాల కారణంగా వంతెన కొట్టుకుపోయి దారి లేకుండా పోవడంతో ఈ సమాచారం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం సంబంధిత అధికారులు యుద్ధ ప్రాతిపదికనగా పనులు చేపట్టాలని సూచించడంతో సోమవారం నుండి పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు పట్టణంలో ట్రాఫిక్ నియంత్రించడానికి తాత్కాలికంగా పంచాయతీ నిధులతో కిలో మీటర్‌పైగా ఉన్న రోడ్డు నిర్మాణం పనులు చేపట్టామని రెండు రోజుల్లో ఎమ్మెల్యే భూమి పూజ చేయనున్నారని, పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించడానికి బాధ్యతలు చేపడతామని వారు తెలియజేశారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్త్రీ శక్తి కార్యక్రమం



**పీలేరు,ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీలేరులో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో స్త్రీ శక్తి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో "నారి శక్తి వందన్ అధినియం - 2023" అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే చట్టం దేశ రాజకీయాలలో ఒక మేలిమలుపు అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం బాధ్యులు డాక్టర్ కవిత ఆధ్వర్యంలో మహిళా అధ్యాపకులు భారతదేశ చట్టసభలలో స్త్రీలు అనే అంశంపై బృంద చర్చను నిర్వహించారు. ఈ చర్చలో కళాశాల విద్యార్థుల పాల్గొన్నారు. తరువాత డాక్టర్ కవిత నారీ శక్తి అధినియం 2023 గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి విద్యార్థులలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి అధ్యాపకులు రోహిణి కుమారి, మెహనాజ్ బేగం, సుధారాణి, తులసి, రేవతి విద్యార్థినిలు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**కెవిపల్లి,ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆదర్శ పాఠశాల కె.వి పల్లిలో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి అప్లికేషన్లు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ మూడే శీను నాయక్ తెలియజేశారు.. మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపిసి, సిఇసి, ఎంఈసి నాలుగు గ్రూపులు ఉన్నాయన్నారు. దరఖాస్తు చేయడానికి ఈ నెల 30 చివరి తేది అని, ఓసి, బిసి వారు 200 రూపాయలు ఎస్సీ, ఎస్టీ వారు 150 రూపాయలు చెల్లించి ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు.


## రోడ్డు నిర్మాణం పనులకు ఎమ్మెల్యే భూమి పూజ



**పీలేరు, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఈ నెల 15వ తేదీ బుధవారం ఉదయం రోడ్డు పనులకు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి భూమి పూజ చేయనున్నారు. కొత్తపేట నుండి రత్నం స్కూల్ వరకు కిలోమీటర్ పైగా ఉన్న రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేయనున్నారు. పీలేరు పట్టణంలో నేషనల్ హైవే ఆర్వోబి బ్రిడ్జి పనులు జరుగుతున్న క్రమంలో ట్రాఫిక్ ఎక్కువ కావడంతో వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం ప్రత్యామ్నాయం రోడ్డుగా కొత్తపేట నుండి చిత్తూరు రోడ్డు లోకి సులువుగా చేరుకునేందుకు ఎమ్మెల్యే భూమి పూజ చేయనున్నారు. ప్రజా ప్రతినిధులు, కూటమి శ్రేణులు, అనుబంధ సంఘాలు, కార్యకర్తలు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జ్ లు నల్లారి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుచున్నాము.

## ప్రజల మనిషి వైయస్ అవినాష్ రెడ్డి

### - మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



**కడప , ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లాలో అనునిత్యం ప్రజలకు అందు బాటులో ఉండి ప్రజల కోసం పనిచేసే ఏకైక నాయకుడు వైఎస్ అవినాష్ రెడ్డి అని మైదుకూరు మాజీ శాసనసభ్యులు శెట్టిపల్లె రఘురామి రెడ్డి అన్నారు. సోమవారం తన స్వగృహంలో వైయస్ అవినాష్ రెడ్డి వ్యక్తిత్వంపై డా.తవ్వా వెంకటయ్య రాసి, వ్యాఖ్యానించి, రూపొందించిన డిజిటల్ డాక్యుమెంటరీని రఘురామి రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినాష్ రెడ్డి ప్రజల మనిషి అన్నారు. ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ తన శిష్యుడు డా.తవ్వా వెంకటయ్య వైయస్ కుటుంబం పైన అపారమైన అభిమానం ఉన్నవాడని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి, తన అన్న జగన్మోహన్ రెడ్డి అడుగుజాడల్లో నడిచే గొప్ప ప్రజా నాయకుడని అభివర్ణించారు.ఈ కార్యక్రమంలో సాహితీవేత్త జింకా సుబ్రహ్మ ణ్యం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఐటీ వింగ్ కార్యదర్శి నారాయణరెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయ కులు నాగేశ్వర్ రెడ్డి , తవ్వారుపల్లె మాజీ సర్పంచ్ అమరేశ్వర్ రెడ్డి, మైదుకూరు వైసిపి నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రాజశేఖరరెడ్డి,మైదుకూరు మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రవి, సుబ్బరా యుడు యాదవ్, మైలవరం మండల కన్వీనర్ మహేశ్వర రెడ్డి, సుబ్బారావు, ముద్దనూరు మండల నాయకులు శివప్రసాద్, ప్రొద్దుటూరు వైసిపి అభిమానులు రాజేష్ ,ఆల్ ఫ్రైడ్ , ఓబులేసు, మోషా మొదలైన వారు పాల్గొన్నారు.

## విజయవాడలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

### : మద్యం సేవించి బస్సు నడుపుతూ పట్టుబడ్డ డ్రైవర్



**విజయవాడ , ఏప్రిల్ 13( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర బాబు ఆదేశాలతో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా, ప్రమాదకరంగా వెళ్తున్న ఒక నేషనల్ ట్రావెల్స్ బస్సును ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బాలమురళీకృష్ణ అడ్డుకున్నారు. డ్రైవర్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష నిర్వహించగా, మద్యం సేవించినట్లు తేలడంతో తక్షణమే కేసు నమోదు చేశారు. ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడితే సహించేది లేదని, ప్రైవేట్ ట్రావెల్స్ డ్రైవర్లపై నిరంతరం నిఘా ఉంటుందని పోలీసులు హెచ్చరించారు. రోడ్డు భద్రతను మెరుగుపరిచేందుకు ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## ఉయ్యూరు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### : ఒకరు మృతి, ఇద్దరి పరిస్థితి విషమం



**విజయవాడ , ఏప్రిల్ 13( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఉయ్యూరు – మచిలీపట్నం జాతీయ రహదారిపై సోమవారం ఉదయం ఘోర ప్రమాదం సంభవించింది. జియో పెట్రోల్ బంక్ సమీపంలో ఒక కారు అదుపుతప్పి ప్రమాదానికి గురవడంతో ఒకరు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. కారులో ప్రయాణిస్తున్న ఏడుగురిలో ఇద్దరి పరిస్థితి అత్యంత విషమంగా ఉండగా, మిగిలిన వారికి తీవ్ర గాయాలయ్యాయి.బాధితులంతా విజయవాడ సమీపంలోని కానూరు గ్రామానికి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనతో కానూరులో విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జగ్గయ్యపేటలో డ్రగ్స్ కలకలం

### : 30 మందికి పాజిటివ్.. పోలీసుల మెరుపు తనిఖీలు



**విజయవాడ , ఏప్రిల్ 13( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట పరిధిలో మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. తాజాగా నాలుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో నిర్వహించిన స్పెషల్ ఆపరేషన్‌లో భాగంగా 112 మందికి డ్రగ్స్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. ఇందులో ఏకంగా 30 మందికి డ్రగ్స్ వాడుతున్నట్లు పాజిటివ్‌గా తేలడం స్థానికంగా కలకలం రేపింది.డ్రగ్స్‌కు బానిసైన వీరిని తక్షణమే డీ-అడిక్షన్ సెంటర్లకు తరలించినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. యువతను మత్తు ఊబి నుంచి కాపాడేందుకే ఈ ముమ్మర తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. మాదకద్రవ్యాల రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. పట్టణాన్ని డ్రగ్స్ రహితంగా మార్చే వరకు ఈ తనిఖీలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

## ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన ఎస్పీ



**ఏలూరు ఏప్రిల్ 13( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఏలూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం PGRS కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను ఎస్పీ ప్రతాప్ కిషోర్ స్వీకరించారు. భూ వివాదాలు, కుటుంబ తగాదాలు, ఆర్థిక మోసాలకు సంబంధించిన 46 అర్జీలు అందాయని, బాధితులకు న్యాయం చేయాలని అధికారులకు సూచించారు.

## ఈనెల 15న ముఖ్యమంత్రి జిల్లా పర్యటన : జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా



**నరసరావుపేట, ఏప్రిల్ 13( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటన కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా జిల్లా అధికారులను ఆదేశించారు. ఆదివారం ముఖ్యమంత్రి జిల్లా పర్యటన పైన అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 15వ తేదీనరాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటన ఉన్నందున అధికారులు సన్వయంతో ఏర్పాట్లను పకడ్బందీగా చేసి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు.అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవ కార్యక్రమం లో అమరావతి ప్రాంతంలో పర్యటించనున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని, విజయవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు.హెలిపాడ్, నిరంతర విద్యుత్ సరఫరా త్రాగునీరు ,శానిటేషన్,మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలి అని అధికారులను ఆదేశించారు.

## అక్రమ సంబంధం వల్లే అడ్వకేట్ దారుణ హత్య... పోలీసులే నిందితులు



**నరసరావుపేట, ఏప్రిల్ 13( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** చిలకలూరిపేట మండలం యడవల్లి గ్రామ సమీపంలో జరిగిన అడ్వకేట్ శ్రీరామ హరిప్రసాద్ హత్య కేసును చిలకలూరిపేట రూరల్ పోలీసులు 48 గంటల్లోనే ఛేదించారు. వివాహేతర సంబంధం మరియు కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్లు నరసరావుపేట లిలిడీఎస్పీ ఎం. హనుమంతరావులిలి మీడియాకు వెల్లడించారు. పల్నాడు ఎస్పీ కార్యాలయంలో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న ప్రధాన నిందితులు ఉసర్తి వెంకట కోటయ్య, కొండారెడ్డి శ్రీనివాసరావులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఇనుప రాడ్డు, బైక్ మరియు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మృతుడు హరిప్రసాద్ మార్కాపురం బార్ అసోసియేషన్‌లో అడ్వకేట్‌గా పనిచేస్తున్నారు. నిందితుడైన కోటయ్యకు, హరిప్రసాద్ భార్య నాగజ్యోతికి మధ్య ఉన్న అక్రమ సంబంధమే ఈ ఘాతుకానికి దారితీసింది. తన భర్త వేధిస్తున్నాడని నాగజ్యోతి చెప్పడంతో, అతడిని అడ్డు తొలగించుకోవాలని కోటయ్య పథకం వేశాడు. ఈ క్రమంలో తన స్నేహితుడు శ్రీనివాసరావు సహాయంతో హరిప్రసాద్‌ను నరసరావుపేటకు పిలిపించి, మద్యం సేవించిన అనంతరం యడవల్లి వద్ద నిర్మానుష్య ప్రాంతంలో ఇనుప రాడ్డుతో తలపై కొట్టి అతి దారుణంగా చంపారు. ఆపై ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహంపై స్కూటీని నెట్టి నిందితులు పరారయ్యారు. ఎటువంటి ఆధారాలు లేని ఈ కేసును పల్నాడు జిల్లా లిఎస్పీ బి. కృష్ణారావులి ఆదేశాల మేరకు రూరల్ సీఐ బి. సుబ్బానాయుడు, ఎస్ఐ అనిల్ కుమార్ , ఎస్సై లేఖా ప్రియాంక, యడ్లపాడు ా× ు.శివ రామ కృష్ణ, ూా× –శ్రీనివాస రావు, హెడ్ కానిస్టేబుళ్లు వెంకట రావు, సాంబయ్య నాయక్, దేవ రాజు, కానిస్టేబుళ్లు బోసుబాబు, జాని భాష, రత్న కిషోర్, సుబ్బారావు, నాగేశ్వర రావు జిల్లా యస్.పి. అత్యంత చాకచక్యంగా దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్నారు. సమర్థవంతంగా పనిచేసి నిందితులను అరెస్ట్ చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించటం జరిగిందని, అదేవిధంగా డీఎస్పీ కూడా అభినందించి రివార్డుకు పంపించడం జరిగిందని తెలిపారు.

## క్రోసూరులో ఫోక్సో కేసు... గురజాలలో మహిళలు దేహశుద్ధి...

### ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్న ఏఎస్ఐ లీలలు..




**నరసరావుపేట, ఏప్రిల్ 13( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్‌లోని పోలీస్ డిపార్ట్‌మెంట్ లో ఒక్కసారిగా కలకలం రేపింది.. గుంటూరుకు చెందిన ఏఎస్ఐ శ్రీనివాసరావు రాసలీలు, క్రైమ్ కేసులో రోజురోజుకు సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. గుంటూరుకు చెందిన ఏఎస్ఐ శ్రీనివాసరావు ప్రస్తుతం మాచర్ల టౌన్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. మాచర్ల పర్యటక ప్రాంతం కావడంతో అక్కడకు వచ్చే జంటలు ఏకాంతంగా ఉన్న సమయంలో వారి వీడియోలు తీయించేవాడు. రాత్రి సయమంలో గస్తీ పేరుతో తిరుగుతూ ఒంటరిగా కనిపించిన వాళ్లని కూడా టార్గెట్ చేసేవాడు. వాళ్లని బెదిరించి వారి వద్ద నుండి డబ్బులు వసూలు చేసేవాడు. అయితే ఆటో డ్రైవర్ తీసిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. మాచర్లలో ఒక మహిళతో సన్నిహితంగా ఉండే శ్రీనివాసరావు వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఆమెతో యూనిఫారంలో ఉండగా.. ఏకాంతంగా ఉన్న వీడియోలు బయటకు వచ్చాయి. ఇవన్నీ సోషల్ మీడియాలో రావడంతో ఏఎస్ఐ రాసలీలలు వెలుగులోకి వచ్చాయి. దీంతో ఏఎస్ఐని ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. శ్రీనివాసరావు ఏ పోలీస్ స్టేషన్ లో పనిచేసిన ఇదే తరహాలో వ్యవహరించేవాడన్న ఆరోపణలున్నాయి. 2024లో క్రోసూరులో ఏఎస్ఐగా పనిచేస్తున్నప్పుడు సమీప బంధువైన మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. నువ్వు లాడ్జిలో కనిపించినట్లు, ఎవరితోనూ బస్సు ఎక్కుతున్నట్లు చూశానని బంధువులతో చెబుతానని బాలికను బెదిరించాడు. అర్ధరాత్రుల్లో ఆ బాలికకు ఫోన్ కూడా చేసేవాడు. ఈ క్రమంలోనే ఆ బాలిక పోలీసులకు ఫిర్యాదు చేయగా అతనిపై ఫోక్సో కేసు నమోదైంది. దీంతో అతన్ని సస్పెండ్ చేశారు. ఆ తర్వాత అతను గురజాలలో విధులు నిర్వహిస్తుండగా మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో వారంతా కలిసి అతనికి దేహశుద్ధి చేశారు. ఈ ఘటన జరిగిన కొద్ది రోజుల తర్వాత మాచర్లకు బదిలీ అయ్యాడు. అక్కడ కూడా ఏకాంతంగా ఉన్న జంటలను బెదిరిస్తూ తీసిన వీడియోలు కలకలం రేపాయి. దీంతో ఏఎస్ఐ ను మరోసారి సస్పెండ్ చేశారు. వివాదాలకు కారణమైన ఏఎస్ఐపై కఠిన చర్యలు తీసుకోవాలని, విధుల నుంచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు తక్షణమే అమలు చేయాలి

### పల్నాడు భవన-ఇతర నిర్మాణ కార్మిక సంఘం డిమాండ్...

### కలెక్టరేట్ ఎదుట నిరసన... కలెక్టర్ కు వినతి




**నరసరావుపేట, ఏప్రిల్ 13( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** 2019 నాటికి సంక్షేమ బోర్డు ద్వారా అమలులో ఉన్న అన్ని సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పల్నాడు భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ 2019–2026 మధ్య సంక్షేమ బోర్డులో లబ్ధిదారులుగా దరఖాస్తు చేసుకున్న అన్ని క్లెయిమ్‌లను పరిష్కరించాలని అలాగే 2019 లో కార్మిక శాఖ ద్వారా అమల్లో ఉన్న 14 రకాల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభిస్తున్నామని ప్రకటించి నెలకు పైగా గడిచినా ఇప్పటికీ సచివాలయాల్లో కానీ, కార్మిక శాఖ కార్యాలయాల్లో కానీ దరఖాస్తులు స్వీకరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులు కార్యాలయాలకు వెళ్లితే ఒకరు సచివాలయాలకు పంపుతుండగా, సచివాలయ సిబ్బంది తమకు ఎలాంటి ఆదేశాలు లేవని చెప్పడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు గతంలో మాదిరిగానే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను కార్మిక శాఖ కార్యాలయాల ద్వారానే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధంగా మన రాష్ట్రంలో కూడా సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేయాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సిఐటియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అధికార పార్టీ వారికి ఆదాయ వనరులుగా మారిన ఇసుక

### మాజీ శాసనసభ్యులు కైలా అనిల్ కుమార్.




**మచిలీపట్నం ఏప్రిల్ 13( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పామర్రు మాజీ శాసనసభ్యులు కైలా అనిల్ కుమార్ ఇసుక రవాణాపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఇసుక రవాణా అధికార పార్టీకి చెందిన వ్యక్తులకు ఆదాయ వనరుగా మారిందని ఆయన విమర్శించారు. సోమవారం మచిలీపట్నంలో కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసిన ఆయన, పామర్రు నియోజకవర్గ అవసరాల కోసం ప్రణాళికాబద్ధంగా ఇసుక పర్మిషన్లు ఇవ్వాలని కోరారు. ఇసుక పంపిణీలో వివక్ష చూపకుండా, సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. అధికార పార్టీ మద్దతు ఉన్న వారికే అనుమతులు ఇవ్వడం సరికాదని పేర్కొన్న ఆయన, అక్రమ ఇసుక రవాణాను ప్రశ్నిస్తే గత విషయాలను ప్రస్తావిస్తూ తప్పించుకోవడం ప్రజాప్రతినిధులకు తగదని హెచ్చరించారు. అధికార పార్టీ నేతలు విచ్చలవిడిగా ఇసుకను ఆదాయ వనరుగా మార్చుకున్నారని ఆరోపించారు. అలాగే ముఖ్యమంత్రి ప్రతిపాదించిన "మావిగాన్" ఆలోచనపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పామర్రు శాసనసభ్యులు కుమార్ రాజా రెవెన్యూ అధికారులను అవినీతిపరులుగా చిత్రీకరించడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఆంజనేయ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు విజయవంతం చేద్దాం.

### ఆలయ ఈవో తిక్కిశెట్టి వీర వెంకట మోహన్ రావు.



**మచిలీపట్నం ఏప్రిల్ 13( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** స్థానిక పరాసుపేట లో వెంచేసి యున్న శ్రీ సువర్చలా సమేత ఆంజనేయ స్వామి వారి దేవస్థానం నందు శ్రీ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్స వములు మే 9 నుండి 17 వరకు జరుగు సందర్భముగా పందిరి గుంజ సోమవారం ఉదయం పాట పాడటం జరిగింది ఈ కార్యక్రమం లో ఆలయ కార్యనిర్వాహణాధికారి తిక్కిశెట్టి వీర వెంకట మోహనరావు ఆలయ చైర్మన్ ఆలపాటి రమేష్ పాలక వర్గం సభ్యులు విశ్వనాధ పల్లి నాగరాజు, మానేపల్లి ఉషారాణి ,మోపర్తి ఉమాదేవి , జంపాని కనక దుర్గా రాజేష్ , నందిపాముల శ్రీనివాస్ ,ఐలా శివ నాగేశ్వరరావు మరియు భక్తులు పాల్గొన్నారు. అని దేవస్థాన ఈ ఓ తిక్కిశెట్టి వీర వెంకట మోహన్ రావు ఒక ప్రకటనలో తెలియజేశారు.

## అన్నవరం చేరుకున్న రామతీర్థం సీతారామ.. లక్ష్మణ విగ్రహాల ఊరేగింపు



**అన్నవరం ఏప్రిల్ 13( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయనగరం జిల్లా రామతీర్థం కోదండరామస్వామివారి ఆలయంలో ఆరేళ్ల క్రితం దుండగుల దాడిలో ధ్వంసమైన రాముడి విగ్రహంతో పాటు సీతాదేవి, లక్ష్మణుడి విగ్రహాల నిమజ్జన కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఊరేగింపు సోమవారం కాకినాడ జిల్లా అన్నవరం చేరుకుంది. విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగిస్తున్నారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఈవో త్రినాథరావు, ఛైర్మన్ రోహిత్, పెద్ద సంఖ్యలో భక్తులు తొలి పావంచాల వద్ద స్వాగతం పలికారు. భక్తుల శ్రీరామ నామస్మరణతో ప్రాంగణాలు మార్మోగిపోయాయి. కోలాటం, భజన తదితర సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహలంగా ఊరేగింపు ముందుకు సాగింది. ఈ ఊరేగింపు పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి, ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయాలకు వెళ్లి కోటిపల్లి చేరుకుంటుంది. అక్కడ శాంతి హోమం అనంతరం గోదావరి నదిలో జలాధివాసం చేస్తారు.

## మణికాంత్ యాగక్షేత్రంలో విశేష పూజలు, హోమాలు: ఆధ్యాత్మిక ప్రయోజనాలు



**విజయవాడ , ఏప్రిల్ 13( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడ పట్టణంలోని కొత్తూరు తాడేపల్లి మణికాంత్ ఆధ్యాత్మిక యాగక్షేత్రంలో ఏప్రిల్ 14, 15 తేదీలలో విశేష పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు యాగక్షేత్రం వ్యవస్థాపకులు డాక్టర్ రవి కుమార్ తెలిపారు. తిరుపతి నుండి వచ్చే నిష్ణాతులైన వేదపండితులు ఈ పూజలను నిర్వహిస్తారు. హనుమాన్ ఉపాసకులు శ్రీ పుండరీక వరదానంద స్వామి పాల్గొన్న వారికి హనుమాన్ విజయ కంకణాలు, వేద ఆశీర్వచనం అందిస్తారు. ఈ హోమంలో పాల్గొనడం ద్వారా మానసిక శాంతి, సుఖ సంతోషాలు కలుగుతాయని వివరించారు.

## 36 గిరిజన కుటుంబాలకు సోలార్ విద్యుత్.. ప్రారంభించిన మంత్రి



**సాలూరు ఏప్రిల్ 13( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పార్వతీపురం మన్యం జిల్లాలో అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు 14,100 సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని రాష్ట్ర మంత్రి సంధ్యారాణి అన్నారు. సాలూరు మండలంలోని కొత్తవలస పంచాయతీ కేంద్రంలో 36 మంది గిరిజనుల ఇళ్లపై ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్యానల్స్‌ను సోమవారం మంత్రి ప్రారంభించారు. నియోజకవర్గంలో ఒకేసారి 4వేల కనెక్షన్లు ఇచ్చినట్టు చెప్పారు. వైకాపా హయాంలో గిరిజనులు విద్యుత్ బిల్లులు చెల్లించేవారని.. ఇప్పుడు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను కూటమి ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకం పేరిట దోపిడీ జరిగిందని.. అలాంటి సమస్యలు ఉండకూడదనే ముఖఆధారిత హాజరు విధానాన్ని తీసుకువచ్చామన్నారు. సిగ్నల్స్ లేని చోట ఎవరికైనా ఇబ్బందులు ఉంటే అక్కడ తక్షణమే సెల్ టవర్లు ఏర్పాటు చేయించేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.




# అల్లు వారు అలా అన్నారో లేదో...




టాలీవుడ్ అగ్ర నిర్మాత అల్లు అరవింద్.. డెకాయిట్ సినిమా సక్సెస్ మీట్లో ఈ చిత్ర కథానాయిక మృణాల్ ఠాకూర్‌ను ఉద్దేశించిన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గతంలో తాను ఇక్కడి అబ్బాయిని పెళ్లి చేసుకోమని లావణ్య త్రిపాఠికి చెబితే, ఆమె వరుణ్‌తేజ్‌ను పెళ్లాడి హైదరాబాద్‌లో సెటిలైపోయిన విషయాన్ని గుర్తు చేసిన అరవింద్.. మృణాల్ కూడా ఇక్కడి అబ్బాయినే పెళ్లి చేసుకుని ఇక్కడే ఉండిపోవాలని ఆకాంక్షించారు. దీంతో మృణాల్ తెగ సిగ్గుపడిపోయింది. ఆడిటోరియం అంతా నవ్వులతో నిండిపోయింది. ఐతే అరవింద్ ఈ కామెంట్ చేసిన కాసేపటికే సోషల్ మీడియా జనాలు డ్యూటీ ఎక్కేశారు. లావణ్య.. వరుణ్‌తో ప్రేమలో ఉన్న విషయం తెలిసే అరవింద్ అప్పట్లో ఆ కామెంట్ చేశారని, ఇప్పుడు మృణాల్ కూడా ఇక్కడ ఓ అబ్బాయిని చూసుకుంది కాబట్టే ఆయన ఇలా మాట్లాడారని కథలు అల్లేశారు. అంతే కాక ఆ అబ్బాయి ఎవరో కూడా చెప్పేశారు. అక్కినేని ఫ్యామిలీకి చెందిన సుమంత్‌తో మృణాల్ ప్రేమలో ఉన్నట్లుగా పేర్కొంటూ వీళ్లిద్దరూ సన్నిహితంగా ఉన్న ఒక ఫొటోను షేర్ చేస్తున్నారు నెటిజన్లు. సుమంత్, మృణాల్ కలిసి సీతారామం సినిమాలో నటించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఇద్దరూ ఎక్కడో ఒక ఫొటోకు పోజు ఇచ్చారు. ఆర్టిస్టులు కలిసి నటించినపుడు ఇలా ఫొటోలు దిగడంలో ఆశ్చర్యమేమీ లేదు. కానీ సోషల్ మీడియా జనాలు మాత్రం ఇలా ఆలోచించడం లేదు. ఇద్దరికీ లింక్ పెట్టేశారు. కానీ డెకాయిట్ ప్రి రిలీజ్ ఈవెంట్లో మృణాల్.. సుమంత్‌ను అన్నా అని సంబోధించిన విషయాన్ని మరవకూడదు. అన్న అనే పదానికి అర్థం తెలియకుండానే ఆమె అలా అని ఉండదు. సుమంత్‌కు గతంలో హీరోయిన్ కీర్తి రెడ్డితో పెళ్లయింది. కొంత కాలానికే ఇద్దరూ విడిపోయారు. 20 ఏళ్లకు పైగా సుమంత్ సింగిల్‌గానే ఉంటున్నాడు. తనకు మళ్లీ పెళ్లి చేసుకునే ఉద్దేశమే ఉన్నట్లు కనిపించడం లేదు. పైగా సుమంత్‌కు 51 ఏళ్లు వచ్చేశాయి. మృణాల్ కంటే అతను చాలా పెద్దవాడు. వయసు 50 దాటినా, అమ్మాయితో వయసు అంతరం ఉన్నా పెళ్లి చేసుకోవడానికి అవేవీ అడ్డంకులు కాదు కానీ.. సుమంత్, మృణాల్ మధ్య ఎలాంటి వ్యక్తిగత బంధం లేదన్నది క్లియర్‌గా తెలుస్తున్నా.. ఇలా లింక్ పెట్టేయడం విచిత్రం.

# నందమూరి నాలుగో తరం సినిమా ఏమైంది?



టాలీవుడ్లో ఘన చరిత్ర ఉన్న నందమూరి కుటుంబం నుంచి ఇప్పటికే మూడు తరాల హీరోలు వచ్చారు. ఆ ఫ్యామిలీ నుంచి నాలుగో తరం హీరో ఎంట్రీ గురించి రెండేళ్ల ముందే అనౌన్స్‌మెంట్ వచ్చింది. హరికృష్ణ మనవడు, జానకి రామ్ తనయుడు అయిన నందమూరి తారక రామారావు (తన షార్ట్ నేమ్ కూడా ఎన్టీఆర్‌యే)ను సీనియర్ దర్శక నిర్మాత వైవీఎస్ చౌదరి హీరోగా పరిచయం చేయబోతున్నట్లు 2024లో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆ సినిమా అనౌన్స్‌మెంట్ టైంలో కూడా వైవీఎస్ చాలా హంగామానే చేశారు. హీరో హీరోయిన్లకు సంబంధించి వేర్వేరుగా వీడియోలు రిలీజ్ చేశారు. సినిమా గురించి వరుసగా ప్రెస్ మీట్లు పెట్టి మీడియా దృష్టిని ఆకర్షించడానికి ప్రయత్నించారు. ఇది తెలుగుదనం ఉట్టిపడే సినిమా అని.. తెలుగు భాష, సంస్కృతి గురించి ప్రపంచానికి చెప్పే చిత్రమని ప్రకటించారు. కానీ ప్రారంభానికి ముందు ఇంత హడావుడి చేశారే కానీ.. ఆ తర్వాత సినిమా గురించి సౌండే లేదు. అసలు ఈ సినిమా సెట్స్ మీదికి వెళ్లిందా.. షూటింగ్ జరుగుతోందా.. చిత్రీకరణ ఏ దశలో ఉంది.. విడుదల ఎప్పుడు.. ఇలా ఏ సమాచారం బయటికి రావడం లేదు. ఏడాదిగా ఈ సినిమా అసలు వార్తల్లోనే లేదు. హీరో కొత్త వాడే అయినా.. నందమూరి లాంటి పెద్ద కుటుంబానికి చెందిన కుర్రాడు. కాబట్టి ఆ ఫ్యామిలీ బ్యాకప్ తనకు ఉంటుంది. తన అరంగేట్ర సినిమాను పట్టించుకోకుండా వదిలేసే అవకాశం లేదు. తమ సోదరుడి కొడుకు విషయంలో కళ్యాణ్ రామ్, జూనియర్ ఎన్టీఆర్ కూడా దృష్టిసారిస్తూనే ఉండొచ్చు. అయినా ఈ సినిమా ఊసులేవీ వినిపించకపోవడం ఆశ్చర్యం కలిగించే విషయమే. ఐతే వైవీఎస్ ఒకప్పుడు హరికృష్ణకు పెద్ద బ్రేక్ ఇచ్చి ఉండొచ్చు.. రామ్‌ను హీరోగా నిలబెట్టి ఉండొచ్చు.. కానీ చాలా ఏళ్ల నుంచి ఆయన ఫామ్‌లో లేడు. చివరగా తీసిన రేయ్ సినిమా పరిస్థితి ఏంటో తెలిసిందే. ఇప్పుడున్న ఫామ్‌లో వైవీఎస్ బాక్సాఫీస్ దగ్గర ప్రభావం చూపించగలరా లేదా అనే ఆలోచనలో పడ్డట్టు వార్తలు వస్తున్నాయి. బహుశా ఆ కారణంతోనే సినిమాను హోల్డ్‌లో పెట్టేశారా అనే సందేహాలు కలుగుతున్నాయి. లేని పక్షంలో ఇంత కాలం వైవీఎస్ సైలెంటుగా ఉండే అవకాశం లేదు.

# ప్యారడైజ్ గుమ్మడికాయ... రోమియో కొబ్బరికాయ




మార్చి నుంచి ఆగస్టుకి విడుదల తేదీ వాయిదా వేసుకున్న నాని ది ప్యారడైజ్ ఖచ్చితంగా చెప్పిన డేట్ కి విడుదలవుతుందా లేదానే అనుమానాలు ఇండస్ట్రీలో కొనసాగుతూనే ఉన్నాయి. నిన్న వదిలిన హీరోయిన్ కయదు లోహర్ బర్త్ డే పోస్టర్లో మరోసారి తేదీని స్పష్టంగా పేర్కొన్నారు కానీ కేవలం వీటిని బట్టే మాట మీద ఉంటారన్న గ్యారెంటీ అయితే లేదు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నాని మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఆగస్ట్ 21 వదులుకునేందుకు సిద్ధంగా లేరు. ఇప్పటికైతే ఎలాంటి మార్పు లేదని క్లారిటీ వచ్చింది కాబట్టి అభిమానులు రిలాక్స్ అవ్వొచ్చు. అలాని కన్ఫర్మ్ గా చెప్పలేని పరిస్థితి కూడా గమనించాలి. మళ్ళీ ఏ మాత్రం లేట్ అయినా దాని ప్రభావం నేరుగా బ్లడీ రోమియో మీద పడుతుంది. ఎందుకంటే దర్శకుడు సుజిత్ ఆల్రెడీ స్క్రిప్ట్ సిద్ధం చేసుకుని ఉన్నాడు. క్యాస్టింగ్ కూడా పేపర్ మీద రెడీగా ఉంది కానీ నాని డేట్స్ అందుబాటులోకి వస్తేనే ఇతర ఆర్టిస్టుల కాల్ షీట్స్ తీసుకోవడానికి కుదురుతుంది. లేదంటే వృధా అవుతాయి. ప్యారడైజ్ కోసం జుత్తు గెడ్డం బాగా పెంచేసిన నాని వాటిని ఇప్పట్లో తీసేయలేడు. బ్లడీ రోమియో గ్యాంగ్ స్టర్ డ్రామా కాబట్టి దాని లుక్ పూర్తి డిఫరెంట్ గా ఉంటుంది. శ్రీకాంత్ ఓదెల గుమ్మడికాయ కొట్టేసి పంపిస్తే కానీ సుజిత్ కొబ్బరికాయ కొట్టలేడు. గతంలో అయితే నానికి ఈ సమస్య లేదు. ఒకే లుక్ తో ఒకే టైంలో రెండు సినిమాలు చేసేవాడు. కానీ ఇప్పుడు ప్యాన్ ఇండియా సబ్జెక్టులతో అలా కుదరడం లేదు. మేకోవర్ ప్రతిదానికి వేర్వేరుగా విభిన్నంగా ఉంటున్నాయి. ఒకేసారి వచ్చి క్లాష్ కు సిద్ధపడాలని ముందు అనుకున్న పెద్ది, ప్యారడైజ్ రెండూ ఒకే సమస్యని ఎదురుకుంటూ ఉండటం విచిత్రం. నిర్మాణం, పాటల చిత్రీకరణ, రాజీ లేని దర్శకుల మొండిపట్టు లాంటి కారణాల వల్ల ఫ్యాన్స్, ట్రేడ్ కోరుకున్న డేట్లకు ఇవి రాలేకపోతున్నాయి. నాని ప్యారడైజ్ కోసం ప్రాణాలు పెట్టేస్తున్నాడు. ఇప్పటిదాకా అందని ద్రాక్షలా ఊరిస్తున్న హిందీ మార్కెట్ దీని దెబ్బతో ఎక్కడికో తీసుకెళ్తుందని ధీమాగా ఉన్నాడు. ఫ్యాన్స్ నమ్మకం కూడా అదే.



# బిజినెస్ న్యూస్



## ఓలా నుంచి కొత్త స్కూటర్.. సింగిల్ ఛార్జింగ్‌తో 320 km



ప్రముఖ విద్యుత్ వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ కొత్త స్కూటర్‌ను మార్కెట్‌లోకి లాంచ్ చేసింది. సొంతంగా అభివృద్ధి చేసిన 4680 భారత్ సెల్‌తో తయారు చేసిన ఎస్1 ఎక్స్‌ం 5.2 kWh వేరియంట్‌ను (Ola S1 X+) సోమవారం విడుదల చేసింది. దీని ధరను రూ.1,29,999గా నిర్ణయించింది. ఇన్‌హౌస్‌లో రూపుదిద్దుకున్న సెల్ టెక్నాలజీ సాయంతో తయారు చేసిన స్కూటర్ కావడంతో అందుబాటు ధరలో తేవడం సాధ్యమైందని ఓలా ఎలక్ట్రిక్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఏప్రిల్ 15 వరకు ప్రారంభ ధర కింద రూ.1.29 లక్షలకు విక్రయించనున్నట్లు ఓలా తెలిపింది. ఇందులో 11kW మిడ్ డ్రైవ్ మోటార్‌ను అమర్చినట్లు వెల్లడించింది. సింగిల్ ఛార్జింగ్‌తో 320 కిలోమీటర్లు (IDC రేంజ్) ప్రయాణించొచ్చని పేర్కొంది. ఈ స్కూటర్ టాప్ స్పీడ్ గంటకు 125 కిలోమీటర్లు. బ్రేకింగ్ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తూ బ్రేక్ బై వైర్, ఫ్రంట్ డిస్క్ బ్రేక్ సదుపాయంతో తీసుకొచ్చినట్లు ఓలా వెల్లడించింది. ఓలా ఎలక్ట్రిక్ ఎస్1 ప్రో స్కూటర్లతో పాటు రోడ్‌స్టర్ విద్యుత్ మోటార్ సైకిళ్లను విక్రయిస్తోంది. ఎస్1 థర్డ్ జనరేషన్‌లో ఎస్1 ప్రోం (5.2kWh, 4kWh), ఎస్ 1ప్రో (4 kWh, 3kWh) పేరుతో ప్రీమియం స్కూటర్లను విక్రయిస్తోంది. మాస్ మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకుని ఎస్1 ఎక్స్‌ం (4ెఔౌ్ట్ర), ఎస్ 1 ఎక్స్ (2, 3, 4 ెఔౌ్ట్ర) విక్రయిస్తోంది. రోడ్‌స్టర్ ఎక్స్‌ంను 4.5ెఔౌ్ట్ర, 9.1 ెఔౌ్ట్ర కాన్ఫిగరేషన్‌తోనూ, రోడ్‌స్టర్ ఎక్స్‌ను 2.5, 3.5, 4.5 kWh బ్యాటరీ సామర్థ్యంతోనూ విక్రయిస్తోంది. ఎస్1 ఎక్స్‌ం 5.2 ెఔౌ్ట్ర ఈ శ్రేణిలో కొత్తగా చేరింది.


## ఏళ్ల తరబడి ఉన్న యాప్‌ను నిలిపేసిన మైక్రోసాఫ్ట్

మే 25 నుంచి 'అవుట్‌లుక్ లైట్' సేవలు బంద్

టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ తమ వినియోగదారులకు ముఖ్యమైన హెచ్చరిక జారీ చేసింది. ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్లలో తక్కువ డేటా, తక్కువ మెమరీతో పనిచేసేలా రూపొందించిన 'అవుట్‌లుక్ లైట్' యాప్ సేవలను నిలిపివేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. 2026, మే 25వ తేదీ నుంచి ఈ యాప్ పూర్తిగా పనిచేయడం ఆగిపోతుందని కంపెనీ స్పష్టం చేసింది.

ఏమిటీ మార్పు? ఎందుకు?

ఎంట్రీ లెవల్ స్మార్ట్‌ఫోన్లు, నెమ్మదిగా ఉండే ఇంటర్నెట్ కనెక్షన్లను దృష్టిలో ఉంచుకుని మైక్రోసాఫ్ట్ గతంలో ఈ 'లైట్' వెర్షన్‌ను ప్రవేశపెట్టింది. అయితే, తన మొబైల్ ఈమెయిల్ వ్యూహాన్ని ఏకీకృతం చేయడంలో భాగంగా ఇకపై సింగిల్ ప్లాట్‌ఫామ్ పైనే దృష్టి సారించాలని కంపెనీ నిర్ణయించింది. మైక్రోసాఫ్ట్ 365 సేవలతో అనుసంధానం, మెరుగైన భద్రతా ఫీచర్లు, వ్యక్తిగత, కార్పొరేట్ వినియోగదారులకు విస్తృతమైన సౌకర్యాలను ఒకేచోట అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు



సమాచారం. ఈ క్రమంలోనే 2025 చివరి నుంచే కొత్త డౌన్‌లోడ్లను నిలిపివేసిన కంపెనీ ఇప్పుడు తుది గడువును ఖరారు చేసింది. వినియోగదారులపై ప్రభావం ఇలా.. మే 25 తర్వాత మీ ఫోన్‌లో యాప్ ఐకాన్ కనిపించినప్పటికీ మెయిల్ బాక్స్ ఓపెన్ కాదు. అంటే, మీరు కొత్త ఈమెయిల్స్ చూడటం, పంపడం లేదా క్యాలెండర్ ఈవెంట్లను నిర్వహించడం సాధ్యం కాదు. అయితే, వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. మీ ఈమెయిల్స్, కాంటాక్ట్స్, క్యాలెండర్ డేటా అంతా సురక్షితంగా ఉంటుంది. యూజర్లు వెంటనే గూగుల్ ప్లే స్టోర్ నుంచి ప్రధాన 'అవుట్‌లుక్ మొబైల్' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి.

ఇప్పుడేం చేయాలి?

అంతరాయం లేని అవుట్‌లుక్ సర్వీసుల కోసం వినియోగదారులు గడువు ముగిసేలోపే కొన్ని చర్యలు తీసుకోవాలని కంపెనీ సూచించింది. అవుట్‌లుక్ లైట్ యాప్‌లోనే అప్‌గ్రేడ్ ఆప్షన్ కనిపిస్తుంది. దాని ద్వారా నేరుగా మెయిన్ యాప్‌కు వెళ్లవచ్చు. మెయిన్ అవుట్‌లుక్ యాప్ ఇన్‌స్టాల్ చేసిన తర్వాత మీ పాత మైక్రోసాఫ్ట్ అకౌంట్ వివరాలతో లాగిన్ అయితే సరిపోతుంది. మీ మెయిల్స్, అటాచ్‌మెంట్లు ఆటోమేటిక్‌గా సింక్ అవుతాయి. కంపెనీ ఐటీ నిర్వాహకులు ప్రత్యేకంగా ఏమీ చేయనవసరం లేదు కానీ, తమ ఉద్యోగులు సకాలంలో కొత్త యాప్‌కు మారేలా అంతర్గత మార్గదర్శకాలు జారీ చేయాల్సి ఉంటుంది. సాంకేతికత సర్వీసులు వేగంగా మారుతున్న తరుణంలో ఫీచర్ రిచ్ ప్లాట్‌ఫామ్‌ల వైపు మొగ్గు చూపడం ద్వారా యూజర్లకు అత్యుత్తమ సేవలు అందించడమే లక్ష్యమని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. కాబట్టి, గడువు ముగిసే వరకు వేచి చూడకుండా ఇప్పుడే మెయిన్ యాప్‌కు మారడం ఉత్తమం.

## నష్టాలతో ముగిసిన సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఇరాన్-అమెరికా మధ్య చర్చలు విఫలం కావడం, హర్మూజ్ దిగ్బంధనానికి ట్రంప్ ఆదేశాలు ఇవ్వడం వంటి కారణాలతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. దీనికితోడు చమురు ధరలు పెరగడమూ ప్రతికూల ప్రభావం చూపింది. దీంతో పీఎస్‌యూ బ్యాంక్స్, బ్యాంకింగ్, ఫైనాన్షియల్, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. అయితే, సెన్సెక్స్ ఓ దశలో 1600 పాయింట్లు నష్టపోగా.. తర్వాత కాస్త కోలుకుని 700 పాయింట్ల నష్టానికే పరిమితం కావడం ఊరటనిచ్చే అంశం. సెన్సెక్స్ ఉదయం 75,937.16 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,550.25) భారీ నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 75,868.32 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 702.57 పాయింట్ల నష్టంతో 76,847.57 వద్ద ముగిసింది. నిఫ్టీ 207.95 పాయింట్ల నష్టంతో 23,842.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 56 పైసలు బలహీనపడి 93.39గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఐసీఐసీఐ బ్యాంక్, ఎన్టీపీసీ, యాక్సిస్ బ్యాంక్ స్టాక్స్ మాత్రమే లాభపడ్డాయి. మారుతీ సుజుకీ, ఇండిగో, బజాజ్ ఫైనాన్స్, రిలయన్స్, టీసీఎస్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 102 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4717 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

స్టాక్ మార్కెట్ నష్టాలకు కారణాలు ఇవే..

అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు విఫలం కావడంతో హర్మూజ్‌ను దిగ్బంధించాలని తమ నౌకాదళాన్ని ఆదేశించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఈ పరిణామాలు సెంటిమెంట్ దెబ్బతీశాయి.

ఇటీవల కాస్త తగ్గిన చమురు ధరలు మరోసారి భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు ఏడు శాతం పెరిగి 102 డాలర్లకు చేరింది.

ఇటీవల కాస్త కోలుకున్నట్లు కనిపించిన రూపాయి మరోసారి పతనం కావడం, ఆసియా పసిఫిక్ మార్కెట్లు నష్టాల ప్రభావం మన సూచీలపై పడింది.

## రెడ్‌మీ నుంచి ఎంట్రీ లెవల్ 5జీ స్మార్ట్‌ఫోన్




ఎంట్రీ లెవల్ స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేయాలనుకునే వారి కోసం షావోమీ సంస్థ రెడ్‌మీ ఏ7 ప్రో 5జీ (=వుఎఱ ూ7 ూతీశీ) మొబైల్‌ను లాంచ్ చేసింది. ఇప్పటికే గ్లోబల్ మార్కెట్‌లో ఎంట్రీ ఇచ్చిన ఈ ఫోన్.. భారత్‌లో సోమవారం విడుదలైంది. 6,300 ఎంఏహెచ్ బ్యాటరీ, 32 ఎంపీ డ్యూయల్ కెమెరాతో ఈ ఫోన్ వస్తోంది. ఫీచర్లు, ధర వివరాలు ఇప్పుడు చూద్దాం..

రెడ్‌మీ ఏ7 ప్రో ఫీచర్లు ఇవే..

6.9 అంగుళాల హెచ్‌డీం ఎల్‌సీడీ స్క్రీన్

ఆండ్రాయిడ్ 16తో కూడిన హైపర్‌ఓఎస్3

నాలుగేళ్ల ఓఎస్ అప్‌డేట్స్, ఆరేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్

ఆక్టాకోర్ యూనిసోక్ టీ8300 ప్రాసెసర్

జెమినై, గూగుల్ సర్కిల్ టు సెర్చ్ ఏఐ ఫీచర్లు

32 ఎంపీ ప్రధాన కెమెరా

ముందు వైపు 8 ఎంపీ కెమెరా

వైఫై 5, బ్లూటూత్ 5.4, యూఎస్‌బీ టైప్-సి పోర్ట్, ఐపీ52 రేటింగ్

6300 ఎంఏహెచ్ బ్యాటరీ, 15ఔ వైర్డ్ ఛార్జింగ్ రివర్స్ వైర్డ్ ఛార్జింగ్ సదుపాయం

ధర: 4జీబీం 64జీబీ= రూ.11,499

4జీబీం 128జీబీ= రూ.12,499

## తిరుమలలో భాష్యకారుల ఉత్సవం ప్రారంభం



**తిరుమల, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమల శ్రీవారి ఆలయంలో భాష్యకారుల ఉత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. 19 రోజులపాటు ఈ ఉత్సవం జరుగనుంది. ఏప్రిల్ 22న శ్రీ భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. భగవద్ రామానుజులు విశిష్టాద్వైత సిద్ధాంతపరంగా మీమాంస గ్రంథానికి "శ్రీభాష్యం" పేరుతో వ్యాఖ్యానం చేశారు. అందుకే భాష్యకారులుగా పేరొందారు. శ్రీరామానుజులవారు జన్మించిన అరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాదీ శ్రీవారి ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. భాష్యకారుల ఉత్సవాల మొదటిరోజున సోమవారం ఉదయం శ్రీవారి ఆలయంలో మొదటి గంట అనంతరం శ్రీ రామానుజులవారిని బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయ్యంగార్లు దివ్యప్రబంధ గోష్టి చేపట్టారు. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, తిరుమల చిన్నజీయర్‌స్వామి పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగి తొలగింపు

**తిరుమల, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమలలోని లగేజీ సెంటర్‌లో నరసింహారెడ్డి అనే వ్యక్తి భక్తుల నుండి డబ్బులు వసూలు చేసినట్లు టీటీడీ దృష్టికి వచ్చింది. సదరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని విధుల నుండి తొలగించడం జరిగింది. టీటీడీ లగేజీ డిపాజిట్ సేవలను పూర్తిగా ఉచితంగా అందిస్తోంది. భక్తులెవ్వరూ తమ లగేజీ కోసం డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని టీటీడీ తెలియజేస్తోంది. నిబంధనలను అతిక్రమించి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే విజిలెన్స్ కంట్రోల్ నెంబర్ : 9866898630 కు ఫిర్యాదు చేయాల్సిందిగా భక్తులకు టీటీడీ సూచించింది.

## ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వారాంతపు రద్దీతో శ్రీకాళహస్తీశ్వరాలయం భక్త జనసంద్రంగా మారింది. ముక్కంటిశని దర్శనం కోసం సోమవారం భక్తులు భారీగా తరలివచ్చారు. సర్వదర్శనంతోపాటు రాహు కేతు పూజలకు సంబంధించిన క్యూలైన్లు, ప్రత్యేక శీఘ్రదర్శన క్యూ లైన్లు, భక్తులతో నిండిపోయాయి. రాహు కేతు పూజలు నిర్వహణకు భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. ఉదయం నుంచి రాత్రి ఆలయం మూత వేసే వరకు రద్దీ తగ్గలేదు. ముందస్తుగా ఆలయ అధికారులు క్యూలైన్లో వేచి ఉన్న భక్తులకు మజ్జిగ మంచినీళ్లు ఏర్పాటు చేశారు.

## పెద్దగోర్పాడులో ఘనంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం

**- సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే**



**చంద్రగిరి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పాకాల మండలం పెద్దగోర్పాడు గ్రామంలో శ్రీరామనవమి 16 వార్షికోత్సవ సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, అర్చకులు కలిసి పూర్ణకుంభ కలశంతో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని'కి స్వాగతం పలికారు. శ్రీ కోదండ రామస్వామి వారికి నవమి అభిషేకము ఉభయదారులు సూరినేని దామోదరం కుటుంబ సభ్యులు, నారా పార్థసారథి నాయుడు, ప్రభాకర్ నాయుడు, చంగల్రాయ నాయుడు, బాలరాజుల నాయుడు కుటుంబ సభ్యులు కలిసి, గ్రామస్తుల ఆధ్వర్యంలో జరిపించారు. ఆదివారం రాత్రి గరుడసేవ, సీతారాములను ఊరేగింపుగా నిర్వహించి భజన కార్యక్రమాలు నిర్వహిస్తారు. శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవానికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పట్టు వస్త్రాలు సమర్పించారు. పూజా కార్యక్రమంలో పాల్గొని అనంతరం తీర్థప్రసాదాలను అందుకున్నారు. గ్రామస్తులతో, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల గురించి సమీక్షించారు. గ్రామంలో ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించారు.

## రాహత్ పథకంపై అవగాహన



**తిరుపతి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రోడ్డు ప్రమాద బాధితుల కోసం 'రాహత్' పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ప్రారంభించారు. 'గోల్డెన్ అవర్'లో నగదు రహిత చికిత్సతో పాటు ప్రమాదం జరిగిన రోజు నుంచి 7 రోజుల పాటు రూ. 1.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందుబాటులో ఉంటుందని తెలిపారు. డయల్ 112 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని, ప్రాణ రక్షణే లక్ష్యంగా ఈ పథకాలను ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గోవిందా రావు, డీఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్, రవాణా శాఖ అధికారి మురళి మోహన్ పాల్గొన్నారు.





## స్వర్ణ చంద్రగిరి అభివృద్ధికి జిల్లా అధికారులు సమిష్టిగా కృషి చేయాలి

**- కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**



**తిరుపతి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్వర్ణ నారావారిపల్లె అభివృద్ధి నమూనాను ఆదర్శంగా తీసుకొని, స్వర్ణ చంద్రగిరి ప్రాంతాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి జిల్లా అధికారులు ప్రణాళికాబద్ధంగా త్వరితగతిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో, స్వర్ణ చంద్రగిరి అభివృద్ధి అంశంపై తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, స్వర్ణ చంద్రగిరి ప్రత్యేక అధికారి/జిల్లా పంచాయతీ అధికారి సుశీల దేవి మరియు ఇతర శాఖల అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ నూతన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, యూరియా వినియోగాన్ని తగ్గిస్తూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, చిరుధాన్యాల సాగుపై రైతులను ఆకర్షిస్తూ పీఎండీఎస్ కిట్లను అందించాలని తెలిపారు. రైతుల ఆదాయాన్ని పెంచేందుకు పాల ఉత్పత్తి అభివృద్ధి, రైతు బజార్ల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యానవన రంగంలో మామిడి తోటల అభివృద్ధికి మ్యాంగో ఫ్రూట్ కవర్ల వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. చంద్రగిరి పరిధిలోని చెరువులను గుర్తించి, మత్స్యకారులకు జీవనోపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా రంగంలో డిజిటల్ ఎడ్యుకేషన్‌ను బలోపేతం చేయాలని, పాఠశాలలలో పెండింగ్ లో పనులను సమర్థవంతంగా అమలు చేయాలని, 'మనబడి -- మన భవిష్యత్తు' కార్యక్రమం కింద పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం, ఇంప్రూవ్‌మెంట్ ప్యానెల్‌లు ఏర్పాటు చేయడం, విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు, యోగా తరగతులు నిర్వహించడం వంటి చర్యలు చేపట్టాలని తెలిపారు. స్వర్ణ చంద్రగిరిలో ప్రతి ఇంటికి రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, అర్హులైన వారికి గృహాలు మంజూరు చేయాలని సూచించారు. జల జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి తాగునీటి కనెక్షన్ కల్పించాలన్నారు.. పశువైద్య అధికారులు పశువులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు, కీటకనాశన మందులు పంపిణీ చేసి పశువులను వ్యాధుల నుండి రక్షించే చర్యలు చేపట్టాలన్నారు. పశుసంవర్ధక శాఖ ద్వారా అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు, బీమా సదుపాయాలపై రైతులకు వివరాలు తెలియ చేయాలన్నారు.
శిబిరంలో పాల్గొన్న రైతులు పశువుల సంరక్షణకు సంబంధించిన సందేహాలను నిపుణులను అడిగి నివృత్తి చేసుకున్నారు. సంజీవని ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు పంపాలని, ఏబిహెచ్‌ఏ నమోదును 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నారీ శక్తి వందన సమ్మేళనానికి సంబంధించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగాన్ని వర్చువల్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో డి ఈ ఓ కుమార్, సి పి ఓ రాజశేఖర్, ద్వామా పి డి శ్రీనివాసరావు, డి ఆర్ డి ఏ పి డి శోభన్ బాబు, డి ఎమ్ అండ్ హెచ్ ఓ బాలకృష్ణ నాయక్, వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో వ్యవసాయ సర్వీసు దరఖాస్తుల సమాచారం

**- ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతేటి**

**తిరుపతి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సర్వీసుల కోసం దరఖాస్తుదారుల సీనియారిటీ లిస్టును రైతులకు అందుబాటులో ఉంచుతున్నామని ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ ఆఫీసులో సోమవారం ఉదయం డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేయడంలో జరుగుతున్న ఆలస్యాన్ని సీఎండి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీఎండి మాట్లాడుతూ వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరుకు సంబంధించిన సమాచారాన్ని సంబంధిత సెక్షన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రైతులకు ఫోన్ చేసి స్పష్టంగా తెలియజేయడంతోపాటు ఆయా సెక్షన్ల వ్యవసాయ విద్యుత్ సర్వీసు దరఖాస్తుల సీనియారిటీ లిస్టును నోటీసు బోర్డులో ప్రదర్శించాలని ఆదేశించామన్నారు, సీనియారిటీ ఆధారంగా సర్వీసులను మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ అంశంలో నిబంధనలను అతిక్రమిస్తే సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా సోమవారం నిర్వహించిన డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి కార్యక్రమం ద్వారా 54 మంది వినియోగదారులు విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా నమోదయ్యే సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలియజేశారు.

## ఎస్పీడీసీఎల్‌లో అంబేద్కర్ జీవిత చరిత్రపై ఫోటో ఎగ్జిబిషన్

**-ప్రారంభించిన ఏపీఎస్పీడీసీఎల్ సిఎండి**

**తిరుపతి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారతరత్న డా॥ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఏపీఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో డా॥ బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్రపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివ శంకర్ లోతేటి సోమవారం ప్రారంభించారు. డా॥ బి.ఆర్. అంబేద్కర్ జీవితంలో ప్రతి అంశాన్ని ప్రతిబింబించే విధంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈ ఛాయాచిత్ర మాలిక లో అంబేద్కర్ కుటుంబ నేపథ్యం, విద్యాభ్యాసం, రాజకీయ జీవితం, దళితుల అభ్యున్నతికి కృషి, కార్మిక సంస్కరణలు, ఇంధన రంగం, భారత రాజ్యాంగంలో ఆయన పాత్ర, బుద్ధిజమ్ స్వీకరణ తదితర అంశాలను వివరణాత్మకంగా పొందుపరిచారు. అంబేద్కర్ జీవిత చరిత్ర పై ప్రత్యేకంగా వీడియోను రూపొందించి, ఎగ్జిబిషన్ లో ప్రదర్శించారు. ఫోటో ఎగ్జిబిషన్ ప్రారంభ కార్యక్రమంలో భాగంగా జ్యోతి ప్రజ్వలన అనంతరం ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ సమాజానికి డా॥ బి.ఆర్. అంబేద్కర్ అందించిన సేవలను కొనియాడారు. ఆయన రూపొందించిన భారత రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శవంతమైందని తెలిపారు. స్త్రీ జాతి, కార్మికుల అభ్యున్నతికి ఆయన పాటుపడ్డారని తెలియజేశారు. సమాజంలో అసమానతల నిర్మూలనకు ఆయన అవిరళ కృషి గావించారని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ ఎగ్జిబిషన్ ను తిలకించడం ద్వారా అంబేద్కర్ జీవిత చరిత్రను క్షుణ్ణంగా తెలుసుకోవచ్చన్నారు. రెండు రోజులు పాటు కొనసాగే ఈ ఎగ్జిబిషన్ ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈనెల 14వ తేదీన డా॥ బి.ఆర్. అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు కె. గురవయ్య, పి. అయూబ్ ఖాన్, కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె ఆదిశేషయ్య, సి.హెచ్. రామచంద్ర రావు, జే. రమణాదేవి, ఆర్. పద్మ, ఎం మురళి కుమార్, ఎం. ఉమాపతి, కే. సంపత్ కుమార్, ఎస్. రమణ, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కే. జనార్ధన్ నాయుడు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ముక్కంటి సేవలో ఎమ్మెల్సీ గ్రీష్మ



**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే రాహు కేతు దోష నివారణ పూజలకు కావలి ఎమ్మెల్సీ గ్రీష్మ కుటుంబ సభ్యులతో కలసి ఆలయం విచ్చేశారు. సోమవారం రాహుకాల సమయంలో కాల సర్ప దోష నివారణ పూజలు నిర్వహించుకున్నారు. వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ ఇఓ బికె వెంకటేశులు స్వాగతం పలికారు. తరువాత స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం వేద పండితులచే ఆశీర్వచనం, స్వామి అమ్మవారి చిత్ర పటం తీర్ద ప్రసాదాలు ఇఓ బి కె వెంకటేశులు అందజేశారు. వారితో పాటు ఆలయ బోర్డు సభ్యులు ఉన్నారు.





## బడి ఈడు పిల్లలు అందరూ తప్పనిసరిగా బడిలో చేరాలి

**- 'మన సంకల్పం - విద్యా ప్రగతి' కరపత్రం ఆవిష్కరణ**

**- కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్**

**తిరుపతి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంపొందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న "మన సంకల్పం– విద్యా ప్రగతి" ఎన్రోల్మెంట్ డ్రైవ్‌కు సంబంధించిన కరపత్రాన్ని తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారి రామ్మోహన్, జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్ తో కలసి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న విద్యా సంస్కరణలు, డిజిటల్ విద్యా విధానాలు, మరియు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలు తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని పెంపొందిస్తున్నాయని పేర్కొన్నారు. వీటిపై ప్రతి గ్రామం, ప్రతి వార్డులో విస్తృత ప్రచారం నిర్వహించి, అర్హులైన ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. "మన సంకల్పం –విద్యా ప్రగతి" కార్యక్రమం ద్వారా జిల్లాలో విద్యార్థుల నమోదును గణనీయంగా పెంచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా వాతావరణం, ఆధునిక సౌకర్యాలు, మరియు సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేసి, తల్లిదండ్రులను తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రోత్సహించడం ఈ డ్రైవ్ ప్రధాన లక్ష్యం అని తెలియపరచలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి, బీసీ వెల్ఫేర్ అధికారి భరత్ కుమార్, సీపీఓ రాజశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

## ప్రజా కలెక్టరేట్ సమస్యల పరిష్కార వేదిక

**-పిజిఆర్ఎస్ అర్జీదారుల సమస్యలకు సకాలంలో పరిష్కారం చూపాలి**

**- కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**

**తిరుపతి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో జిల్లా జాయింట్ కలెక్టర్ డా, ఎస్. వెంకటేశ్వర్ జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కల్లెక్టర్లు శివశంకర్ నాయక్, రోజ్ మాండ్, అనురాధ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి లతో కలసి అర్జీలు స్వీకరించారు. అర్జీదారులకు గౌరవప్రదంగా కుర్చీ ఏర్పాటుతో, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు త్రాగునీటి సౌకర్యం, మెడికల్ క్యాంప్, గ్రామాల నుండి వచ్చు అర్జీదారులకు టి సరఫరా తదితర సౌకర్యాలను కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని, పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ ఓపెనింగ్ లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలకు పరిష్కారం చూపాలన్నారు. పీ జి ఆర్ ఎస్ అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పీజీఆర్ఎస్ లో మొత్తం 380 అర్జీలు రాగా అందులో రెవిన్యూ శాఖకు సంబంధించినవి 226 ఉన్నాయి. మిగతావి శాఖల వారీగా పంచాయతీరాజ్ -26, పేదరిక నిర్మూలన సొసైటీ- 24, హోమ్ -16, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్- 15, పాఠశాల విద్యాశాఖ- 8, విద్యుత్ శాఖ- 8, సర్వే శాఖ- 6, రూరల్ డెవలప్మెంట్ -5, నీటి వనరుల శాఖ- 4, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్- 4, హౌసింగ్ -3, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్- 3, కుటుంబ సంక్షేమ శాఖ- 3, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్- 3, ఎంప్లాయి మెంట్ -2, స్కిల్ డెవలప్మెంట్- 2, సివిల్ సప్లైస్- 2, డిజేబుల్ వెల్ఫేర్- 2, ఇంటర్మీడియట్ విద్యాశాఖ- 2, ఎస్సీ కార్పొరేషన్ -1, తుడా -1, ఆర్టీసీ -1, గనుల మరియు భూగర్భ శాఖ -1, ఆర్ అండ్ బి -1, ఫుడ్ సేఫ్టీ -1, సాంఘిక సంక్షేమ శాఖ -1, టిడ్కో- 1, ఎస్టీ కార్పొరేషన్ -1, టూరిజం- 1, జాతీయ రహదారులు -1, చేనేత మరియు జౌళి- 1, గిరిజన సంక్షేమ శాఖ- 1, స్వర్ణ గ్రామం స్వర్ణ వార్డు -1, దేవాదాయ శాఖ -1 , రూరల్ వాటర్ సప్లై ఇంజనీరింగ్- 1 మొత్తం 380 అర్జీలు రావడం జరిగిందని, సంబంధిత అధికారులు అందరు సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవంతంగా పరిష్కరించాలని స్పందనకు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## స్టేడియం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి

**-కమిషనర్ ఎన్. మౌర్య**



**తిరుపతి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరపాలక సంస్థ పరిధిలోని గొల్లవాణిగుంట లోని క్రికెట్ స్టేడియం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను ఆదేశించారు. గొల్లవాణిగుంటలో ఏర్పాటు చేసిన క్రికెట్ స్టేడియం, పరిసరాలను సోమవారం మధ్యాహ్నం ఇంజినీరింగ్, ఆరోగ్య శాఖ విభాగాల అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టేడియం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. క్రికెట్ స్టేడియం ఎదురుగా ఉన్న రోడ్డు డివైడర్ల మధ్యలో మొక్కలు ఏర్పాటు చేసి అందంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.రమణ, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటరీ సూపర్ వైజర్ సుమతి, తదితరులు ఉన్నారు.

## 16 నుండి ఈట్ స్ట్రీట్‌లో దుకాణాలు నిర్వహించాలి : కమిషనర్

**తిరుపతి, ఏప్రిల్ 13 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డిప్ ద్వారా ఈట్ స్ట్రీట్ లో దుకాణాలు దక్కించుకున్న వారు ఈ నెల 16నుండి దుకాణాలు నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. ఈట్ స్ట్రీట్ లో దుకాణాలు పొందిన వారికి సోమవారం సాయంత్రం కమిషనర్ తాళాలు అందించి దుకాణాల నిర్వహణ నియమాలను తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈట్ స్ట్రీట్ నందు దుకాణాలు పొందిన వారు ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి వ్యాపారాలు నిర్వహించాలని. కేటాయించిన ఆహార పదార్థాలను మాత్రమే విక్రయించాలని తెలిపారు. దుకాణ దారులు నాణ్యమైన ఆహారాన్ని ప్రజలకు అందించాలని నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను అలాగే అధిక ధరలకు విక్రయించరాదని తెలిపారు. ఆహార పదార్థాలతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తడి, పొడి చెత్త బుట్టలను వినియోగించాలని తెలిపారు. ప్లాస్టిక్ కవర్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వినియోగించరాదని తెలిపారు. 24 గంటలు సిసి కెమెరాల నిఘా ఉంటుందని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, రెవిన్యూ అధికారి సేతు మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027